ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 4 నవంబరు 2024 | 5





రాట ముహూర్తం నిర్వహిస్తున్న ప్రముఖులు

భక్తుల సందడి

భీమేశ్వరస్వామి ఆలయం కిటకిట



ద్రాక్షారామ, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో తొలి ఆదివారం పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో భక్తుల కోలాహలం కనిపించింది. ఉదయం నుంచి విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారి ఆలయానికి తరలివచ్చారు. భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వత్థనారాయణ వృక్షం, దీపపు స్తంభాల వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గా భవానీ పర్యవేక్షణలో ఆలయాల సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. భీమేశ్వరస్వామి వారి అన్నదాన మండపం, పీవీఆర్ సత్రంలో భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

అప్పనపల్లి ఆలయంలో రద్దీ

మామిడికుదురు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని ఆదివారం 4051 మంది భక్తులు దర్శించుకుని 2639 మంది అన్న ప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా ఆదివారం ఒక్కరోజు రూ.2,42,303 ఆదాయంగా వచ్చినట్టు సహాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణరాజు తెలిపారు. కార్తీకమాసం కావడంతో దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది.



క్యూలో వేచిఉన్న భక్తులు



అంతర్వేది ఆలయంలో క్యూలో భక్తులు

కిటకిటలాడిన 'అంతర్వేది'

అంతర్వేది, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేకువజాము నుంచి విచ్చేసి నదీ పుణ్యస్నానాలు ఆచరించారు. తొలుత క్షేత్ర సంరక్షకుడు ఆంజనేయస్వామి, క్షేత్ర పాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకుని అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్‌లో వేచి ఉండి స్వామిని దర్శించుకున్న అనంతరం స్వామివారి నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు. ఆలయ సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్‌లో మంచినీటి సదుపాయం అందించారు. అయ్యప్పమాలధారులు, భక్తులు సుదర్శన హోమంలో పాల్గొని స్వామివారిప్రత్యేక పూజలు చేశారు.

దీపారాధన మహోత్సవానికి
రాట ముహూర్తం

ద్రాక్షారామ, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో కార్తీకమాసం ఆఖరు మంగళవారం ఈనెల 26న నిర్వహిస్తున్న 61వ కార్తీక దీపారాధన మహోత్సవానికి ఆదివారం రాట ముహూర్తం జరిపారు. వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి ఉదయం 7.33 గంటలకు రాట ముహూర్తం చేశారు. ముందుగా పూజాదికాలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, అనిశెట్టి రామకృష్ణ, బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, కోశాధికారి చక్కా రాజు, బాలభక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు. రాట ముహూర్తం అనంతరం కార్తీక దీపారాధన మహోత్సవం పోస్టర్‌ను బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, ఎంపీ బోస్ తదితరులు ఆవిష్కరించారు.

నష్ట పరిహారంగా
రూ.149.99 కోట్లు
పంపిణీకి ఓఎన్జీసీ అంగీకారం

7లో

దళిత యువకులపై దాడి కేసు..
పది మంది అరెస్టు

మండపేట, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణానికి చెందిన ముగ్గురు దళిత యువకులపై దాడి చేసి గాయపరిచిన సంఘటనలో బాధితులు బొచ్చా మోహన్‌కిరణ్, పాలపర్తి చంద్రశేఖర్, కొల్లిచంటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పదిమంది నిందితులను అదుపులోకి తీసుకున్నామని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ చెప్పారు. నిందితులను రామచంద్రపురం కోర్టుకు హాజరు పరచగా 14 రోజులు పాటు వారికి రిమాండ్ విధించారని రామచంద్రపురం డీఎస్పీ తెలిపారు.

సిద్ధివినాయకుని ఆదాయం
రూ.5.01 లక్షలు

అయినవిల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసంలో అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానానికి ఆదివారం రూ.5,01,136 ఆదాయంగా వచ్చినట్టు సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 1162 మంది ప్రత్యేక దర్శనం చేసుకోగా, 2494 పులిహోర పొట్లాలు, 3128 లడ్డూ ప్రసాదాలు విక్రయించడంతో పాటు 3540 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.2,55,960 విరాళాలుగా వచ్చినట్టు ఆయన తెలిపారు.



డ్రోన్ల వ్యవసాయం
మారుతున్న విధానం

ప్రత్యేక కథనం..6లో

కలలు శిథిలం

రైల్వేస్టేషన్‌లో లోపల దృశ్యాలు



ఆస్తులు ధ్వంసం

రామచంద్రపురం రైల్వేప్లాట్‌ఫామ్

పొదలు మాటున రామచంద్రపురం రైల్వేస్టేషన్



● రామచంద్రపురం (ద్రాక్షారామ)

కోనసీమ వాసుల చిరకాల వాంఛ కాకినాడ నుంచి కోనసీమ మీదుగా రైల్వేలైన్ నిర్మాణం. రైలు కూత వినాలనే కోనసీమ వాసుల స్వప్నం దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి కృషితో కాకినాడ కోటిపల్లి రైల్వేలైను నిర్మాణంతో తొలి అడుగు పడింది. కోటిపల్లి నరసాపురం మధ్య రైల్వే లైను నిర్మాణం వివిధ దశల్లో ఉంది. కోటిపల్లి నరసాపురం మధ్య రైల్వే లైన్ నిర్మాణం పనులకు ఎన్‌డీఏ ప్రభుత్వం కదలిక తీసుకురావడంతో నిర్మాణ సన్నాహాలు మొదలయ్యాయి. ఒక పక్క రైల్వేలైను నిర్మాణంపై ఆశలు చిగురిస్తుండగా మరో పక్క నిర్మాణం పూర్తి చేసిన కాకినాడ కోటిపల్లి రైల్వే లైను నిర్వహణను రైల్వేశాఖ పూర్తిగా వదిలివేయడంతో రైల్వేలైను, ఆస్తులు ధ్వంసం అవుతున్నాయి. రూ.కోట్లతో నిర్మించిన ట్రాక్, రైల్వేస్టేషన్లు, సిబ్బంది క్వార్టర్లు ధ్వంసమై శిథిల స్థితికి చేరుకున్నాయి.

రైల్వేస్టేషన్లకు వాచ్‌మెన్‌లు కూడా తొలగించడంతో రామచంద్రపురం, కోటిపల్లి రైల్వేస్టేషన్లు ధ్వంసం అయ్యాయి. కిటికీలు, గ్రానైట్ రాళ్లను దుండగులు పట్టుకుపోయారు. అద్దాలు ధ్వంసం చేశారు. రైల్వేస్టేషను మొక్కలు, పొదలతో శిథిలస్థితికి చేరుకుంది. సిబ్బంది క్వార్టర్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వైరింగ్, బోర్డులు, స్విచ్‌లు తీసుకుపోయారు. రావి మొక్కలు పెరిగిపోయి మానులుగా తయారయ్యాయి. ప్లాట్‌ఫారమ్ మొత్తం ధ్వంసం అయింది. పిచ్చిమొక్కలతో నిండిపోయింది.

రైల్వేలైను పునరుద్ధరణ

1940లో రెండో ప్రపంచ యుద్ధం సమయంలో తొలగించిన కాకినాడ కోటిపల్లి రైల్వేలైన్ నిర్మాణానికి దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి కృషితో పునరుద్ధరించారు. 45 కిలోమీటర్లు నిడివిగల రైల్వేలైను నిర్మాణం జరిపారు. రామచంద్రపురం, కోటిపల్లిలో రైల్వే స్టేషన్లు, ద్రాక్షారామ, నరసాపురపేట, కుందూరు, కూరాడ, కొవ్వాడ హాల్ట్‌స్టేషన్లు నిర్మించారు. 20 నవంబరు 2004లో రైల్వేలైను ప్రారంభించారు. తొలుత కొంతకాలం వరకు ట్రైన్ నడిపారు. తదుపరి రైల్ బస్సు ప్రవేశపెట్టారు. సెప్టెంబరు 2019 నుండి రైల్ బస్సు నిలిపివేశారు. రామచంద్రపురం రైల్వేసేషన్‌లో ఏర్పాటు చేసిన రైల్వేరిజర్వేషను కౌంటర్ కూడా మూసివేశారు. రామచంద్రపురం, కోటిపల్లిలో ఉన్న యంత్రసామగ్రి, ఫర్నీచరు తరలించారు. రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేసిన వాచ్‌మెన్‌లు కూడా తొలగించారు.

కాకినాడ..కోటిపల్లి
రైల్వే ఆస్తులు ధ్వంసం
శిథిలమవుతున్న రైల్వేస్టేషన్లు... క్వార్టర్స్
దెబ్బతిన్న ట్రాక్
రైల్వేశాఖ నిర్లక్ష్యం..
కోటిపల్లి నరసాపురం రైల్వేలైను పనుల్లో కదలిక



నరసాపురపుపేట హాల్ట్ స్టేషన్



రామచంద్రపురం రైల్వేస్టేషన్ లోపల దృశ్యాలు

గ్రానైట్ రాళ్లు తొలగించుకుపోయిన దృశ్యం



పనుల్లో కదలిక

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం కోటిపల్లి నరసాపురం రైల్వేలైను నిర్మాణపనుల్లో కదలిక ఏర్పడింది. ఇప్పటికే కోటిపల్లి అమలాపురం మధ్య భూసేకరణ పూర్తి చేశారు. కోటిపల్లి ముక్తేశ్వరం మధ్య గౌతమి నదిపై, బోడసకుర్రు, పాసర్లపూడి మధ్య వైనతేయ నదిపై, సఖినేటిపల్లి నరసాపురం మధ్య వశిష్ఠ నదిపై వంతెనలకు సంబంధించి పిల్లర్లు నిర్మాణం చాలా వరకు పూర్తి చేశారు.

దెబ్బతిన్న ట్రాక్

రాకపోకలు నిలిపిన తర్వాత అప్పట్లో ట్రాక్ నిర్వహణ కొద్దికాలం పాటు చేశారు. తదుపరి వదిలివేయడంతో రైల్వేట్రాక్ చాలా చోట్ల మూసుకుపోయింది. పెద్దపెద్ద మొక్కలు, గడ్డితో ట్రాక్ కనిపించకుండా ఉంది.

మందుబాబుల హల్‌చల్

రామచంద్రపురం రైల్వేస్టేషన్ ఓపెన్ బార్‌గా మారిపోయింది. రాత్రి, పగలు మందు బాబులు హల్‌చల్ చేస్తున్నారు. ప్లాట్‌ఫామ్ పై ఖాళీ మందు సీసాలు దర్శనమిస్తున్నాయి. కొంత మంది మద్యం మత్తులో సీసాలు పగలకొడుతున్నారు.

మళ్లీ మొదలుపెట్టాలా?

కాకినాడ కోటిపల్లి రైల్వేలైను, రైల్వే ఆస్తులపై రైల్వే అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. కోటిపల్లి నరసాపురం రైల్వేలైను పనులు పూర్తి చేసేటప్పటికి కాకినాడ కోటిపల్లి రైల్వేలైను, స్టేషన్లు పూర్తిగా ధ్వంసం అయ్యే అవకాశం ఉంది. కాకినాడ నరసాపురం మధ్య రైలు నడవాలంటే మళ్లీ కాకినాడ రైల్వే లైను పునఃనిర్మాణం చేపట్టే పరిస్థితి తలెత్తవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రైల్వే అధికారులు, ఎంపీ హరీష్‌మాధుర్ స్పందించి కాకినాడ కోటిపల్లి రైల్వేలైను, ఆస్తులు శిథిలం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎన్నికల కోసం
ఎదురుచూపులు

అమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి):

చేనేత సహకార సంఘాల ఎన్నికలు ఎప్పుడో..?



పదకొండేళ్ల అనంతరం ఎన్నికల కోసం చేనేత కార్మికుల నిరీక్షణ
వైసీపీ పాలనలో ఎన్నికల ఊసే లేదు
డిసెంబరు 4న ఎన్నికలు అంటూ టెంటేటివ్ షెడ్యూల్ విడుదల
అనివార్య కారణాలతో మళ్లీ వాయిదా

జిల్లాలో చేనేత సహకార సంఘాలకు డిసెంబరు 4న ఎన్నికలు జరుగుతాయని, అక్టోబరు 10న చేనేత, జౌళిశాఖ కమిషనర్ జి.రేఖారాణి టెంటేటివ్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. దాంతో పదకొండేళ్ల అనంతరం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరగబోతున్నాయని చేనేత కళాకారులు ఎంతో ఆశతో ఎదురుచూశారు. కమిషనర్ ఆదేశాలతో జిల్లా, క్షేత్రస్థాయి అధికారులు చేనేత సహకార సంఘాల కార్మికులను కలుసుకుని సమావేశాలు సైతం నిర్వహించారు. కొత్తగా చేనేత సంఘాల్లో చేరేందుకు సభ్యులకు అవకాశాన్ని సైతం కల్పించారు. అయితే ఇటీవల అమరావతిలో చేనేత, జౌళిశాఖ జిల్లాస్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో మంత్రి సవిత త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. అయితే ఇంత వరకు ఎటువంటి షెడ్యూల్ విడుదల కాలేదని ఉమ్మడి జిల్లా చేనేత సహకార అధికారి కె.పెద్దిరాజు తెలిపారు.

కారణాలు ఎన్నెన్నో..

సహకార సంఘాల ఎన్నికలు వాయిదాకు అనేక కారణాలు ఉన్నాయని సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం కింద చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24వేలు చొప్పున అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ పథకాన్ని కొనసాగించడంతో పాటు కార్మికులకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. అయితే ఈ రెండు పథకాలు ఇంత వరకు గాడిన పడిన దాఖలాలు లేవు. దీంతో ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే ఆ ప్రభావం ఉంటుందన్న వాదనను ఆ పార్టీ నాయకులే వ్యక్తం చేస్తున్నారు. ఉచిత విద్యుత్‌పై క్షేత్రస్థాయిలో కసరత్తులకే పరిమితమైంది.

వైసీపీ పాలనలో ఎన్నికల ఊసేలేదు..

2013 ఫిబ్రవరి 12న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన పాలకవర్గాలు రాష్ట్ర విభజన అనంతరం 2018 వరకు పదవిలో కొనసాగారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం మరో ఏడాది పాటు వారి పదవీకాలాన్ని పొడిగించింది. అనంతరం రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు అందించే అన్ని సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం తుంగలో తొక్కి, రాయితీలు అన్నింటినీ ఎత్తేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన కూడా చేయలేదు. కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతోనే సంఘాలను నడిపించేశారు.

ఫిబ్రవరిలో ఎన్నికలు?

చేనేత సహకార సంఘాలకు 2025 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. అంతేకాకుండా ఎన్నికల ప్రక్రియ ప్రస్తుతానికి వాయిదా పడడంతో షెడ్యూల్ విడుదలైన తర్వాత చేనేత సంఘాల్లో సభ్యులుగా చేరేవారికి అవకాశం కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి అసిస్టెంట్ డైరెక్టర్ ఒక్కరే ఉండడం, సిబ్బంది కొరతతో అనేక సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని చేనేత సహకార సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని ఏ జిల్లాకు ఆ జిల్లాకు అసిస్టెంట్ డైరెక్టర్లను నియమించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం అధికారులే చేనేత సహకార సంఘాలను నిర్వహిస్తున్నారు. పలు సంఘాల్లో ఒక పక్కన వస్త్ర నిల్వలు పేరుకుపోతుండగా మరోపక్కన చేనేత ముడి సరుకైన నూలు కట్టలుగా ఉన్నా నేసేందుకు కార్మికులు ముందుకు రాని పరిస్థితులు కూడా పలు సంఘాల్లో నెలకొన్నాయి. ఇప్పటికైనా కార్మికులందరికీ ఉపాధి కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రక్తపింజరలతో జాగ్రత్త..

ఉప్పలగుప్తం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రక్తపింజర పేరు వినగానే జనం హడలెత్తిపోతారు. దాని విష ప్రభావం అలాంటిది. కోనసీమలో సాధారణంగా నాగుపాము, కట్లపాము ఎక్కువగా సంచరిస్తుంటాయి. రక్తపింజరలు ఎంతో అరుదుగానే కన్పిస్తుంటాయి. అయితే ప్రస్తుతం కోనసీమ వ్యాప్తంగా పలు గ్రామాల్లో రక్తపింజరలు సంచరించడం గమనార్హం. నెల రోజుల్లో తాను పట్టుకున్న పాముల్లో రక్తపింజరలే అధికంగా ఉన్నాయని భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మ అంటున్నారు. దీనికి కారణాన్ని కూడా ఆయన వివరించారు. మెట్ట ప్రాంతం నుంచి కంకర లారీల ద్వారా వివిధ రకాల రక్తపింజరలు కోనసీమకు దిగుమతి అవుతున్నాయని అంటున్నారు. ఏది ఏమైనా ఈ పాముల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచిస్తున్నారు.







సైకిళ్లపై శబరిమలైకు..

దేవరపల్లి నుంచి ఇద్దరు స్వాముల యాత్ర

దేవరపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల ఉంటే కానిది లేదు.. లక్ష్యం ఉంటే సాధించలేదని లేదు.. దీక్షగా ఉంటే ఏదైనా చేయవచ్చు.. ఎంత దూరమైనా వెళ్లవచ్చు.. ఇప్పటి వరకూ భవానీ మాలధారులు.. వెంకటేశ్వర స్వామి మాలధారులను చూశాం.. భక్తితో దీక్షగా నడుచు కుంటూ దర్శనం నిమిత్తం బయలుదేరి వెళుతుంటారు.. చూసేవాళ్లకు ఎందుకిలా అనిపించినా..భక్తిలో ఉన్న పవర్ అది..స్వామిని చూడాలి.. భక్తితో మొక్కాలి అదే ఆశ.. అందుకోసం ఎంత శ్రమ అయినా పడతారు.. లక్ష్యం చేరుకుంటారు.. ప్రస్తుతం స్వాములు ఆ దీక్షను ఆచరిస్తున్నారు.. ఎక్కడో 1800 కిలోమీటర్ల దూరంలో ఉన్న శబరిమలై సైకిళ్లపై వెళుతున్నారు.. గతంలో దివాన్‌చెరువు నుంచి సైకిళ్లపై నలుగురు శబరిమలైకు బయలుదేరి వెళ్లగా తాజాగా ఆదివారం దేవరపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అయ్యప్ప మాల ధారులు కామిశెట్టి వెంకటరమణ, చింతాడ డేవిడ్ శబరిమలైకు సైకిళ్లపై బయలుదేరారు. సైకిళ్లపై వస్తామని స్వామిని మొక్కుకోవడంతో యాత్రకు బయలుదేరినట్టు తెలిపారు. సుమారు 20 రోజులు పడుతుందని తెలిపారు. సైకిళ్లపై శబరి మలై యాత్రకు బయలుదేరిన స్వాము లకు గ్రామస్థులు హారుతులిచ్చి.. ఏ కష్టం లేకుండా క్షేమంగా తిరిగిరావాలని ఘనంగా వీడ్కోలు పలికారు..

డ్రోన్ల వ్యవసాయం!



వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. పాత పద్ధతులను పక్కకు పెట్టి ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రవేత్తలు ఇప్పటికే పలు ప్రయోగాలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించి పొలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అమరావతిలో డ్రోన్ల ఎగ్జిబిషన్ నిర్వహించింది. వ్యవసాయంలో డ్రోన్లు రంగ ప్రవేశం పూర్తిస్థాయిలోకి వస్తే కూలీల బెడద తగ్గిపోతుందని,మందుల వృథాను అరికట్టవచ్చని వ్యవసాయాధికారులు అభిప్రాయ పడుతున్నారు. రైతులకు వ్యవసాయానికి డ్రోన్‌లు సహకారమందిస్తున్నాయి..

6 గంటల్లో 30 ఎకరాలకు పిచికారీ

సామర్లకోట/శంఖవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సస్యరక్షణ ఒక ప్రధాన ఘట్టం. ఇందులో కూలీల ఖర్చు భారీగా ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక ప్రత్యేకతలు ఉండడం వల్ల రైతులు వ్యవసాయంలో ఇబ్బందుల్లో ఉన్నారు. సస్యరక్షణకు భారీగా ఖర్చు చేసి పెట్టుబడుల భారం కింద నలిగిపోతున్నారు. మరో వైపు కూలీల కొరత వెన్నాడుతోంది. పొలం పనులు చేసే కూలీలు రావడమే గగనంగా మారింది. దీనికి పరిష్కారంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డ్రోన్లు వినియోగించేందుకు పరిశోధనలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర వ్యవసాయాధికారులతో ఇప్పటికే సమాలోచనలు చేపట్టారు. రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు డ్రోన్ల వినియోగంపై పూర్తి పట్టు సాధించే దిశలో కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. కొత్త వంగడాల రూపకల్పనలో, కొత్త వ్యవసాయ పనిముట్ల తయారీలో పేరుగాంచిన సాంకేతిక నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో మమేకమవుతూ రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన పథకం కింద తక్కువ ఖర్చుతో డ్రోన్లను వినియోగించి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలోని పంటలకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేందుకు ప్రయోగాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ శాస్త్రవేత్తల నేతృత్వంలో కీటక విభాగం సీనియర్ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పలు ప్రయోగాలు చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల వ్యవసా యాధికారులు అధ్యయనం చేస్తున్నారు.

తక్కువ ఖర్చు..సమయం ఆదా...

డ్రోన్ల టెక్నాలజీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వ్యవసాయ క్షేత్రాల్లో కూలీల కొరతను అధిగమించి సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ఎకరాకు పురుగుల మందు పిచికారీ చేయడానికి రూ.900 నుంచి రూ.1200 వరకూ ఖర్చవుతుంది. అదే డ్రోనుతో అయితే ఎకరాకు రూ.500 అద్దెగా తీసుకుంటారు. డ్రోన్ వినియోగంతో ఏ సమయంలోనైనా, ఏ పంటకైనా సులభంగా పిచికారీ చేయవచ్చు. తక్కువ ఖర్చుతో అంటే ఒక కూలీకి ఇచ్చే రూ.400తో ఒక ఎకరానికి కేవలం 10 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయవచ్చు. డ్రోన్లతో అన్ని రకాల పురుగు, కలుపు మందులు, ఆర్గానిక్ ద్రావణాలు, నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేయవచ్చు. కేవలం 6 గంటల్లో 30 ఎకరాల పంటలకు పిచికారీ చేయవచ్చని శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడైందని వ్యవసాయ ఉన్నతాధికారులు తెలియజేస్తున్నారు. సాధారణంగా ఎకరా పొలానికి పురుగు మందులు పిచికారీ చేయాలంటే 200 లీటర్ల నీరు అవసరం అవుతుంది. డ్రోన్ ద్వారా కేవలం 10 నుంచి 14 లీటర్లు నీరు మాత్రమే సరిపోతుంది. ఏ పంట మీద అయినా సరే 2-3 అడుగుల ఎత్తులో పొలమంతా సమానంగా పిచికారీ చేయడం డ్రోన్‌లతోనే సాధ్యమని వెల్లడైంది. పిచికారీలో 95 శాతం నీటిని, 95 శాతం సమయాన్ని, 25-40 శాతం మందు ద్రావణాన్ని ఆదా చేస్తూ తద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని రుజువైంది. మందు మోతాదు 4వ వంతు తగ్గడం వల్ల పర్యావరణానికి కలిగే కాలుష్యాన్ని నివారించవచ్చు.వరి పంటలో సుడిదోమ లాంటి మొండి పురుగులను డ్రోన్ పిచికారీ ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చు. పురుగు మం దులు వాడకం ద్వారా రైతుల్లో వచ్చే అనారోగ్య సమస్యలు, దుష్ప్రభావాల నుంచి తప్పించవచ్చు.

- మారుతున్న అగ్రి..కల్చరల్!!
- ఆధునికత వైపు అడుగులు
- సాగులో నూతన ఒరవడి
- సస్యరక్షణకు డ్రోన్లు
- పెరుగుతున్న వినియోగం
- ఒక్క క్లిక్‌తో పంటకు రక్షణ
- కూటమి ప్రభుత్వ సహకారం
- డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ

పనిచేస్తుందిలా..

జీపీఎస్, ఆటో పైలెట్ సహాయంతో రిమోట్ ద్వారా లేదా ఎల్‌సీడీ మొబైల్‌లో అగ్రిమీట్, అగ్రి అసిస్టెంట్ యాప్ ద్వారా ముందుగా పొలంపైన సెట్ చేసిన ఎత్తులో నిర్దిష్టమైన దిశలో పిచికారీ చేసేలా డ్రోన్‌కు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడి స్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో స్థాయిని బట్టి ఒక డ్రోన్ ధర రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వర కూ అందుబాటులో ఉన్నాయి. 12-16 వేల ఎంఏహెచ్ లిథియం పాలిమార్ బ్యాటరీతో 10 లీటర్ల డ్రమ్ము, ఒక జత బ్యాటరీస్‌తో ఒక ఎకరానికి కేవలం 10 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయవ చ్చు. సిగ్నల్ పోయినా, మందు అయిపో యినా, బ్యాటరీ తగ్గిపోయినా, పిచికారీ పూర్తయినా, డ్రోన్ మొదట ఉన్న చోటికే తిరిగి వస్తుంది. డ్రోన్ ద్వారా పిచికారీ పూర్తి చేసినదీ, ఇంకా చేయాల్సిందీ, చేస్తున్న ప్రదేశాన్ని మొబైల్ యాప్‌లో ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల్లో చూడవచ్చు. దీన్ని సులభంగా వినియోగించడానికి వీలుగా ఒక పైలెట్(ఆపరేట్ చేయడానికి ల్యాండింగ్, డ్రోన్ తప్పిపోకుండా శాస్త్రీయ శిక్షణ పొందిన వ్యక్తి) రీచార్జి చేస్తూ, బ్యాటరీలు మార్చడానికి ఒక వ్యక్తి, మ్యాపింగ్ చేసేందుకు ఒక వ్యక్తి అవసరం ఉంటుంది. దీన్ని ఉపయోగించే వ్యక్తికి ప్రభుత్వ క్లియరెన్సుతో పాటు డీజీసీఏ వారి నుంచి అనుమతి పత్రం తప్పనిసరి.

యువతకు శిక్షణ

డ్రోన్ల వినియోగంపై యువతకు రాష్ట్రప్రభు త్వం శిక్షణ ఇస్తోంది. వ్యవసాయశాఖ ద్వారా ఎంపికైన యువతకు గుంటూరు విశ్వవిద్యాలయంలో డ్రోన్ల పైలట్‌ల శిక్షణ ఇస్తుంది. డ్రోన్ వినియోగం ఏ పంటకు ఎలా ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేయాలి, డ్రోన్ విడిభాగాలను ఎలా అమర్చాలి అనేదానిపై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తోంది. శిక్షణ తీసుకున్న యువతకు సబ్సిడీలో డ్రోన్లు అందిం చేందకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది.



డ్రోన్ల వినియోగం పెరిగింది



సాంకేతికత పెరగడంతో డ్రోన్ కెమెరాలను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. తాము ఆదునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు శిక్షణ పొందుతున్నాం. ప్రస్తుతం ప్రతి దాంట్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఇది ఫొటోగ్రాఫర్లకు శుభపరిణామం.
- రాము సూరిబాబు, డ్రోన్ కెమెరామెన్

రైతుకు ఆదా అవుతుంది



వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం మంచి ఫలితాలు ఇస్తుంది. దీంతో రైతులకు కూలీల బెడద తగ్గుతుంది. సమయం, సొమ్ములు ఆదా అవుతాయి. ప్రభుత్వం కూడా డ్రోన్‌ల వినియోగం వ్యవసాయంలో పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటుంది.
- రత్నప్రశాంతి, ఏడీఏ, కాకినాడ

వ్యవసాయానికి పూర్వవైభవం



వ్యవసాయంలో పూర్వవైభవానికి డ్రోన్‌లు ఉపయోగపడతాయి. పంటలపై ఎరువులు, పురుగుమందులు చల్లేందుకు హైబ్రిడ్ డ్రోన్‌లు ఉపయోగపడుతున్నాయి. ఆరు లీటర్ల పెట్రోల్‌తో 16 లీటర్ల పురుగుమందు పిచికారీ చేస్తుండడం విశేషం. **- బీవీ.సత్యనారాయణ, రైతు వెంకటకృష్ణరాయపురం, సామర్లకోట**





అయ్యప్ప పడిపూజకు ఏర్పాటు చేసిన సన్నిదానం వేదిక. పక్క చిత్రంలో పూజలు జరిగే ప్రాంగణాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడులో నేడు కోటి బిల్వార్చన

25వేల మంది అయ్యప్ప భక్తులతో పూజలు

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని మినర్వా కళాశాల సమీపంలో సోమవారం జరిపే అయ్యప్పస్వామి లక్ష దీపోత్సవాల మధ్య కోటి బిల్వార్చనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కేరళలోని అయ్యప్ప స్వామి ఆలయం మాదిరిగా 8 ఎకరాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం లక్ష్మి గణపతి హోమంతో కోటి బిల్వార్చన పూజలు ప్రారంభం కానున్నాయి. చండీహోమం, పూర్ణాహుతి, గురు పూజోత్సవం, సాయంత్రం ప్రత్తిపాడులో అయ్యప్పస్వామి ఊరేగింపు, అయ్యప్ప పడిపూజ, 6గంటల నుంచి కోటి బిల్వార్చన పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజల నిమిత్తం శబరిమల సన్నిదానం నుంచి పందల రాజ్యవంశీకులు ఆలయ పూజారి మేల్ శాస్త్రి, స్వామిజీలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఇరవై అయిదు వేల మంది అయ్యప్ప భక్తులు, మరో 10 వేల మంది ప్రజలు పాల్గొనేలా మైదానాన్ని బారికేడ్లతో ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 400 మంది మహిళా వలంటీర్లు, 200 మంది పురుష వలంటీర్లను ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి కోటి బిల్వార్చన పూజలు నిర్వహించే ప్రాంగణాన్ని ఆదివారం సాయంత్రం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సందర్శించారు. పూజలు నిర్వహించే యాగశాలలు, సన్నిదాన ప్రదేశాలు పరిశీలించారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు.





కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేదసభ

వేదాలు..సమస్త ధర్మాలకు మూలం

కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో హోరెత్తిన వేదసభ

కొవ్వూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేదాలు సమస్త ధర్మాలకు మూలమని, వేదస్వస్తి చేయడం వల్ల లోకమంతా సుభిక్షంగా ఉంటుందని గోష్పాదక్షేత్ర వేదశాస్త్రాభివర్ధక పరిషత్ అధ్యక్షుడు డీఆర్ఎస్ఎన్ శాస్త్రి అన్నారు. ఆదివారం కొవ్వూరు గోష్పాదక్షేత్ర వేదశాస్త్రాభివర్ధక పరిషత్ ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని నిరంజన ధర్మజ్ఞాన కళావేదికలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) సహకారంతో వేద సభ జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రుత్వికులు వేద పఠనం చేశారు. వేద మంత్రోచ్చరణ చేస్తూ వేదస్వస్తి పలికారు. వేదశాస్త్ర పండితులు మాట్లాడుతూ కొవ్వూరు ఆధ్యాత్మిక కేంద్రమని, వేదసభలు అంతటా నిర్వహించాలన్నారు. గోష్పాదక్షేత్రంలో నిరంతరం ధర్మకార్యాలు జరుగుతుంటాయన్నారు. కార్యక్రమంలో నోరి భోగేశ్వరశర్మ, విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, దువ్వూరి ఫణి సోమయాజులు, గుళ్లపల్లి శర్మ, దోర్బల ప్రభాకరశర్మ, కలిగొట్ల కృష్ణారావు, చామర్తి రమా సత్యనారాయణ శాస్త్రి, పి.మురళీకృష్ణ తదితరులతో పాటు 150 మంది రుత్వికులు, ఘనాపాటీలు, క్రమపాటీలు, వేదశాస్త్ర పండితులు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ

అన్నవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు గంటల నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం వరకు అంత్రాలయ దర్శనం తాత్కాలికంగా నిలిపివేశారు. ఆదివారం ఒక్కరోజు 4,190 వ్రతాలు జరగ్గా, పలు విభాగాల ద్వారా సుమారు రూ.50లక్షల ఆదాయం లభించింది.

మొదటి కార్తీక సోమవారం ప్రత్యేక ఏర్పాట్లు: మొదటి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటిగంట నుంచి వ్రతాలు ప్రారంభించాలని ఈవో సర్క్యులర్ జారీచేశారు. సత్రం గదులు దొరకని భక్తులకు విష్ణుసదన్ హాల్స్‌లో ఉచిత వసతి ఏర్పాటు చేసి భక్తులను ప్రత్యేక వాహనాల ద్వారా ఉచిత రవాణాసౌకర్యం కల్పించారు.

రత్నగిరిపై ఉప లోకాయుక్త పూజలు



సత్యదేవుని సన్నిధిలో ఉప లోకాయుక్త రజని

సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర ఉపలోకాయుక్త పి.రజనీ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

హద్దుమీరితే.. ఖబడ్దార్!



అనవసర పోస్టులు పెడితే కేసులే..

- పోస్టుపెడితే చిక్కినట్టే
- కేసుల నమోదుకు ఐజీ ఆదేశం
- సీఎంపై అసభ్యకర పోస్టు
- ఒకరిపై ఆదివారం కేసు
- 610 నోటీసులు జారీ
- సైబర్ ల్యాబ్‌లో నిఘా
- లాఠీ తీసిన కూటమి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సహనానికి హద్దు ఉంటుందంటారు. హద్దు మీరితే బుద్ధి చెప్పక తప్పని పరిస్థితులు వస్తాయంటారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ పనే మొదలు పెట్టింది. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సోషల్ మీడియా వేదికగా కొందరు రెచ్చిపోతున్నారు. వైసీపీ ప్రోద్బలంతో ఎన్‌డీఏ కూటమిపై..ప్రధానంగా టీడీపీ పైన, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విషం కక్కుస్తోంది. కొన్ని పోస్టులు మరీ అసభ్యకరంగా, సభ్య సమాజం సిగ్గుపడే విధంగా ఉంటున్నాయి.ఈ దాష్టీకం ఐదేళ్ల నుంచీ ఉన్నా ఇంకా కొనసాగుతూనే ఉంది.దీంతో కూటమి ప్రభుత్వం తన హెచ్చరికలను ఆచరణ లోకి తీసు కురాక తప్పడంలేదు.ఈ క్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఆదివారం జిల్లా పోలీసులతో జరిపిన సమావేశం వాడివేడిగా సాగి ంది. సైబర్ క్రైం, సోషల్ మీడియాపై చర్చ జరిగింది.



అదే అలవాటు..

గత ఐదేళ్లలో వైసీపీ మూకలు టీడీపీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తదితరులపై పలు రకాల అభ్యంతర పోస్టులతో చెలరేగి పోయారు. ప్రధానంగా ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టా ఇలా అందుబాటులో ఉన్న అన్ని ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియా కూడా సిగ్గుపడేలా ఎన్నో పోస్టులు పెట్టేవారు. తమపై వైసీపీ నాయకులు దారుణంగా పోస్టులు పెడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా వారినే కేసులో ఇరికించేవారు. అప్పటి సీఎం హోదాలో జగన్ కూడా వాళ్లను అన్ని విధాలుగా ప్రోత్సహించారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారమిచ్చారు. దీంతో వక్ర మార్గాన్ని విడనాడాలని, ప్రజలకు మేలు చేయ డంలో కలిసి రావాలని కూటమి నేతలు పదేపదే చెప్పుకుంటూ వచ్చారు. కానీ ఫలితం లేకపోయింది. సుమారు నాలుగు నెలల పాటు సీఎం చంద్రబాబు సహనం, ఓర్పు వహించారు.మరోవైపు వైసీపీ వాళ్ల బరితెగింపు అంతకంతకూ మితిమీరిపోతోంది. దీంతో బెండు తీయాల్సిందేనంటూ పోలీసులకు ఆదేశాలిచ్చారు.

ఇక కటకటాలే..

నాలుగు నెలలపాటు సహనం వహించిన కూటమి ప్రభుత్వం..ఇక బుద్ధి చెప్పండని ఆదేశాలు ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగారు. సైబర్ నిపుణులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఏలూరు రేంజ్ ఐజీ జిల్లా పోలీసులతో సమీక్ష చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్‌తో సహా అధికారులు హాజరయ్యారు. సైబర్ క్రైం, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై సుదీర్ఘంగా సమావేశం జరిగింది. ఇకపై ఉపేక్షించవద్దని, కేసులు బనాయించి దర్యాప్తు చేయాలని ఐజీ ఆదేశించారు. ఫేక్ ఐడీలపై దృష్టిసారించాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. దీంతో సోషల్ మీడియాను నిరంతరం నిశితంగా గమనిస్తున్నారు. వేరేచోట్ల పెట్టిన పోస్టుల విషయంలో అక్కడ పోలీస్ సైబర్ ల్యాబ్ లో కూడా ప్రయత్నిస్తున్నారు. సెలవులు, సమయం వంటివి పక్కన పెట్టి సైబర్ ల్యాబ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి రాజకీయ పార్టీల మధ్య వివాదాలు చెలరేగే విధంగా అసభ్యకర పోస్టు పెట్టారంటూ వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు 'చందు వైఎస్ఆర్‌సీపీ' ఫేస్‌బుక్ ఐడీ అడ్మిన్ వీరాబత్తుల చంద్రశేఖర్(వడిశలేరు)పై ఆదివారం సాయంత్రం ఎఫ్ఐఆర్ వేశారు. డీజీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలతో ప్రాథమిక దర్యాప్తు అనంతరం పలు సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఇప్పటికే సోషల్ మీడియాలో అకౌంట్లు ఉన్న జిల్లాలోని పలు రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ఇతర సంఘాలు, వ్యక్తులకు 610 నోటీసులు ఇచ్చారు. ఏ ఐడీ నుంచి అసభ్యకర, ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు వచ్చినా ఆ ఐడీ అడ్మిన్‌పై కేసు తప్పదని హెచ్చరించారు. తమ వద్ద ఉన్న సాంకేతికతను ఉపయోగించుకొని ఫేక్ ఐడీలతో లేదా ఇతర మతలబులు చేసినా పట్టేస్తామని స్పష్టం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా జిల్లాలో వైసీపీ అనుకూల ఖాకీలు కీలకస్థానాల్లో కూర్చోవడంతో ఆయా కేసుల్లో దర్యాప్తు నీరుగారే ప్రమాదం లేకపోలేదని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


డిప్యూటీ తహసీల్దార్ శశిధర్

నకిలీ ఇళ్ల పట్టాల తయారీకి పాల్పడిన డిప్యూటీ తహశీల్దార్ సస్పెన్షన్

అనపర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ముందు అనపర్తిలో వెలుగుచూసిన నకిలీ ఇళ్ల పట్టాల తయారీలో అప్పటి డిప్యూటీ తహశీల్దార్, ప్రస్తుత పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ శశిధర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. అనపర్తి మండలంలో భూసేకరణలో రైతులకు సొమ్ములు చెల్లించకుండా ఎటువంటి హద్దులు లేకుండా తహశీల్దార్ కార్యాలయంలో పట్టాలు తయారుచేసి పంపిణీకి సిద్ధం చేశారు. దీంతో అప్పటి ప్రతిపక్ష నాయకుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డివిషయాన్ని బయట పెట్టారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ తహశీల్దార్ శశిధర్‌ను రంగంపేటకు బదిలీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గతనెల 7న డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో విచారణ నిర్వహించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దాని ఆధారంగా శశిధర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.


పోచవరం ఫెర్రీ పాయింట్ దగ్గర పర్యాటకుల సందడి

పాపికొండలు విహారయాత్రకు పర్యాటకుల తాకిడి

వీఆర్‌పురం/దేవీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు, పేరంటాలపల్లి పర్యాటక ప్రాంతాలలో సందడి వాతావరణం నెలకొంది. గతవారం రోజులక్రితం పాపికొండల విహారయాత్రను ప్రారంభించారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంది. దీంతో పోచవరం ఫెర్రీ పాయింట్ దగ్గర పర్యాటకులతో సందడి వాతావరణం ఏర్పడింది. సుమారు 550మంది పర్యాటకులతో ఆరు బోట్లలో పాపికొండలకు, పేరంటా లపల్లిలో శివాలయంలో శివుడిని దర్శించుకున్నారు. ప్రకృతి అందాలను, గలగలా పారే సెలయేరులను చూసేందుకు పర్యాటకులు ఎగబడ్డారు.

మత్స్యకారులకు నష్టపరిహారం

- రూ.149.99కోట్లు ఇచ్చేందుకు ఓఎన్జీసీ అంగీకారం
- 21న లబ్ధిదారుల ఖాతాల్లో జమ ● ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఓఎన్జీసీ రూ.149.99 కోట్లు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించినట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. ఆదివారం మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో సముద్రంలో ఓఎన్జీసీ పైప్‌లైన్ల కార్యకలాపాలవల్ల మత్స్యకారుల చేపల వేటకు అవరోధం ఏర్పడింది. ఉపాధి లేక మత్స్యకార కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. అమలాపురం ఎంపీ గంటి హరీష్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ పలుమార్లు ఓఎన్జీసీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి జనవరి 29నుంచి జూలై 17వరకు రోజుకు రూ.460వంతున చెల్లించేందుకు ఓఎన్జీసీ అంగీకరించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 23,458 మందికి ఒక్కొక్కరికీ రూ.63,943 వంతున రూ.149.99కోట్లు విడుదల కానున్నట్టు తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఎక్కువ మంది మత్స్యకారులకు నష్టం జరిగిందన్నారు. నాలుగు మండలాలకు చెందిన 20,878మందికి రూ.133.51కోట్లు పరిహారం అందనున్నట్టు తెలిపారు. ఈనెల 21 మత్స్యకార దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నిధులు విడుదలవుతాయన్నారు. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తారన్నారు. ఓఎన్జీసీ ఇచ్చే సొమ్మును తమ ప్రభుత్వం ఇస్తున్నట్టుగా గతంలో వైసీపీ నాయకులు గొప్పలు చెప్పుకున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. సమావేశంలో మత్స్యకార నాయకులు నాగిడి నాగేశ్వరరావు, దండుప్రోలు సత్యం, వాడ్రేవు వీరబాబు, అర్దాని శ్రీను, సంగాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరానికి యూపీఈఐఎఫ్ మద్దతు

- ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి ● ఎమ్మెల్సీ చిరంజీవి
- పాల్గొన్న ఎమ్మెల్యేలు కొండబాబు, చినరాజప్ప, నానాజీ


ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరానికి మద్దతు తెలుపుతున్న యూపీఈఐఎఫ్ నాయకులు

కాకినాడ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తరపున బరిలో ఉన్న ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఐఎఫ్) మద్దతు తెలిపింది. కాకినాడ సాంబమూర్తినగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం సంఘ కార్యదర్శి సురేష్, సంయుక్త కార్యదర్శి బేగ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వి.చిరంజీవి, విశిష్ట అతిథులుగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావు, ఫెడరేషన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఫెడరేషన్ వ్యవస్థాపకులు ఎం.శ్రీవిజయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రైవేట్ పాఠశాలలు నరకం చూశాయని రకరకాల జీవోలతో రాష్ట్రవ్యాప్తంగా చిన్న పాఠశాలలు మూతపడ్డాయన్నారు. గత ప్రభుత్వంమీద 54 కేసులు హైకోర్టులో వేశామని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఫెడరేషన్ తరఫున రాజశేఖరం గెలుపు పూర్తిగా మద్దతును తెలియజేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలను పట్టించుకోలేదని కూటమి ప్రభు త్వం సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంద న్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అధికారులపై ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 6వ తేదీతో ఓటరు నమోదు ప్రక్రియ ముగుస్తుందని ఈలోపు ప్రైవేట్ విద్యాసంస్థల సహకారంతో నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. ఫార్మసీ కళాశాలల అధ్యక్షులు కనకరాజు, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు నారాయణరావు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఎమ్మెల్సీ చిరంజీవిని, అభ్యర్థి రాజశేఖరంను ఫెడరేషన్‌తరపున సత్కరించారు.

ఉండ్రాజవరంలో ఏకాదశ సహస్ర గళార్చన

ఉండ్రాజవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెరవలి మండలానికి చెందిన హిందూ ధర్మ పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో ఆదివారం ఏకాదశ సహస్ర గళార్చన, హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1008మంది చిన్నారులతో 11 సార్లు హనుమాన్ చా లీసా పారాయణ నిర్వహించారు. అనంతరం జ్యోశ్యుల సుబ్రహ్మ ణ్యం ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆంజనేయస్వామి అష్టోత్తర పూజ జరిపారు. కార్య క్రమ సమన్వయకర్త సీహెచ్‌ఎస్ నాగభూషణం మాట్లాడుతూ నేటితరం చిన్నారులకు సనాతన సంప్రదాయాలను పరిచయం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సుంకవల్లి సూర్యానారాయణ, జీవీ సుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, సుంకవల్లి వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



పులి జాడేది?

- దారితప్పుతున్న అటవీ అధికారుల అన్వేషణ
- అధికారుల కెమెరాలకు చిక్కని మన్యం పులి
- 20 రోజులు దాటినా కనపడని పులిజాడ ● భయం గుప్పెట్లో గిరిజనులు

కూనవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎక్కడ నుంచి వచ్చిందేమోగానీ పులి సంచారం ఇక్కడ మన్యం ప్రజల గిరిజనులను భయం వెంటాడుతూనే ఉంది. సరిగ్గా గతనెల 15వ తేదీన దూగుట్టలో పులి పాదముద్రలు కనిపించడంతో మండలంలోని మన్యంలో పులి అలజడి మొదలైంది. ఇప్పటికే నాలు గు పశువులను వేటాడి చంపింది. పులి ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తోంది. కానీ అటవీ అధికారులకు మాత్రం తాము ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కడంలేదని ఫారెస్టు అధికారులు అంటున్నారు. పులిజాడ కోసం ఇప్పటికీ 30కిపైగా ట్రాప్ కెమెరాలు అడవిలో అటవీశాఖాధికారులు ఏర్పాటు చేశారు. ఒక్క కెమెరాలోను పులి జాడ కనిపించడంలేదంటున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో పొలాల్లోకి వెళ్లి వ్యవసాయం చేయాలంటేనే గిరిజన ప్రాంతాల్లో కూలీలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. గిరిజనుల భూములు సాధారణంగా అడవుల్లోనేఉంటాయి. వ్యవసాయం అక్కడే సాగు చేస్తారు. ప్రస్తుతం వరి, మిర్చి పం టలు సాగు చేస్తున్నారు. అటవీ ప్రాంతం దగ్గరలో ఉన్న బోదునూరు, మెట్ట రామవరం, పాలగూడెంతోపాటు వలస గ్రామాలైన రామచంద్రాపురం, కన్నాపురం గ్రామాలు సాయంత్రం 6 దాటితేనే నిశబ్దంగా మారుతున్నాయి. పగటిపూట వ్యవసాయ పనులకు వెళితే పులి వచ్చి ఎక్కడ మీద పడుతుందోనని భయానికి గురవుతున్నట్లు గిరిజనులు తెలుపుతున్నారు.

పులి భయంతో నిద్రపట్టడంలేదు



● కుంజం అనిల్

పులి భయంతో గిరిజన గ్రామాల్లో ప్రజలకు నిద్రపట్టడంలేదు. ము ఖ్యంగా పట్టు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అడవుల్లోకి వెళ్లలేక పట్టుసాగు చేయలేకపోతున్నారు. పశువులను మేపడానికి కూడాగిరిజనులు అడవిలోకి వెళ్లలేక పోతున్నారు. పులికి భద్రత కల్పించి ఇ క్కడి నుంచి దట్టమైన అడవుల్లోకి తరలించే ఏర్పాట్లు అటవీ శాఖాధికారులు చేయాలి. లేకపోతే గందరగోళం భయంతో గిరిజనులు చాలా ఇబ్బంది లు ఎదుర్కోవాల్సి వస్తోంది.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్లు మృతి

- నిద్రమత్తులో లారీని ఢీకొట్టిన కారుడ్రైవర్
- మృతులు అనంతపురం జిల్లా వాసులు
- తూర్పుగోదావరి జిల్లాలో ఘటన


పుల్లలపాడు వద్ద లారీలోకి దూసుకుపోయిన కారు


ప్రమాదంలో మృతిచెందిన రాజేశ్వరి, కనకదుర్గ(ఫైల్)


చికిత్స పొందుతున్న డ్రైవర్ సాకే సూర్యనారాయణ

ఏలూరు క్రైం/నల్లజర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ ఢీ కొనడంతో అక్కా చెల్లెళ్ళు మృతి చెందగా డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 5.30 గంటలకు జరిగింది. అనంతపురంనకు చెందిన అనంతపురంలోని శ్రీసత్యసాయి విద్యాసంస్థలలో ప్రొఫెసర్‌గా పని చేసి పదవీ విరమణ చెందిన కనకదుర్గ (84) వివాహం కాలేదు. ఆమె సోదరి రాజేశ్వరి (87)తో కలిసి ఉంటున్నారు. రాజేశ్వరికి కూడా వివాహం కాలేదు. అనంతపురంలోని శారదా కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరికి సంబంధించిన ఆస్తులు కాకినాడలో ఉన్నాయి. మూడునెలలకు ఒకసారి వెళ్లి అద్దె సొమ్ములను వసూలు చేసుకుని వస్తూ ఉంటారు. దీనిలో భాగంగా అద్దె సొమ్ము వసూలు చేసుకోవడానికి వారివద్ద డ్రైవర్‌గా పనిచేసే అనంతపురం జిల్లా రాప్తాడు మండలం రామనేపల్లి గ్రామానికి చెందిన సాకే సూర్యనారాయణ (45) ఈ నెల 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు అనంతపురం నుంచి కాకినాడకు కారులో వీరిద్దరు బయలుదేరారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విజయ వాడ దాటి న తరువాత ఓ పెట్రో ల్ బంక్ వద్ద కారు పక్కన పెట్టి నిద్రించారు. తిరిగి 4.30 గంటలకు బయలుదే రారు. మార్గమధ్యలో నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఒక లారీ ఆగి ఉంది. దీంతో దానిని గమనించక డ్రైవర్ కారుతో ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో కనకదుర్గ అక్కడి కక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన రాజేశ్వరి, సూర్య నారాయణలను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్దిసేపటికే రాజేశ్వరి మృతిచెందింది. ఆస్పత్రి ఐసీయూలో సూర్యనారాయణ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై నల్లజర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాల ను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.

నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్య


నిమ్మలపూడి సత్యసాయి (ఫైల్)

రంగంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం కోటపాడులో ఓ యువకుడు శరీరానికి నిప్పు అంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ తోట కృష్ణసాయి వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం పి.నాయకంపల్లికి చెందిన నిమ్మలపూడి సత్యసాయి(22) ఇంటర్ పూర్తిచేసి తన అన్నయ్య నిమ్మలపూడి సాయికృష్ణతో కలిసి కోటపాడు పరిధిలో కోళ్లఫారం నిర్వహిస్తున్నారు. సత్యసాయి గతనెల 12న స్వామి అయ్యప్ప మాల ధరించాడు. స్నేహితులతోనే కలిసి పూజ నిర్వహించాడు. 30న స్నేహితుడైన రాజేష్ క్రెడిట్ కార్డు ద్వారా పెట్రోల్ కొట్టించుకున్నాడు. క్రెడిట్ కార్డు తీసిన విష యం రాజేష్‌కు తెలియదు. ఒకవేళ కార్డు విషయం తెలుసుకొని రాజేష్ తనని అడుగుతాడేమోననే భయంతో మనస్థాపానికిలోనై అక్టోబరు 31న ఉదయం 4గంటలకు ఇంట్లో పూజ ఉందని చెప్పి వెళ్లి కోటపాడులోని సు కృతి లేఔట్‌లో నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలియని బంధువులు అతని జాడ కోసం మూడు రోజుల నుంచి వెతుకుతున్నారు. ఈ క్రమంలో సుకృతి లేఔట్‌లో ఈనెల 2న కాలిన గాయాలతో మృతిచెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి మృతిపై పలు అనుమానాలు

గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాయకంపల్లి గ్రామానికి చెందిన నిమ్మలపూడి సత్యసాయి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురి వివరాల ప్రకారం గత 3 రోజుల కిందట సత్యసాయి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అతను కనిపించకపోవడంతో కుటుంబీకుల్లో అలజడి మొదలైంది. సత్యసాయి మృతదేహం శనివారం ఉదయం రామేశ్వరంపేట-కోటపాడు మధ్యలో ఉన్న లేఅవుట్‌లో లభించింది. అతడి మోటారుసైకిల్ రంగంపేట వెళ్లే దారిలో బీరుఫ్యాక్టరీ సమీపంలో పార్కు చేసి ఉంది. మృతదేహానికి, బండికి కిలోమీటరు దూరం ఉంది. అయితే ఒంటికి నిప్పుపెట్టుకున్నప్పటికీ కాలిపోయిన గాయాలుండడంతో సత్యసాయి మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య



కొత్తపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోల్పోయానని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందినట్లు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం... మండల పరిధి అవిడి గ్రామానికి చెందిన దువ్వ చంద్రశేఖర్(43) అవిడి గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేసుకుంటూ ఉండేవాడు. 2023లో అతనిని విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి స్థానిక నాయకులు, అధికారులను కలిసి తనకు గతంలో మాదిరిగానే ఉపాధి కల్పించాలని కోరుతున్నాడు. అయినప్పటికీ ఎవ్వరూ తనకు అవకాశం కల్పించడంలేదని మనస్తాపానికి గురయ్యాడు. దీంతో శనివారం ఇంట్లో సీలింగ్‌ఫ్యాన్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఇతని కుమారుడు దువ్వ ప్రవీణ్ చూసి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ సురేంద్ర మృతదేహాన్ని పరిశీలించి స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన వీధి శ్రీనివాసరావు, నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు

రావులపాలెం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక శివారు వీధివారిలంకకు చెందిన వీధి శ్రీనివాసరావు(46)అరటి గెలలు మోటార్‌సైకిల్‌పై మార్కెట్‌యార్డుకు తెచ్చి అమ్ముతూ జీవనం సాగిస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం లంక పొలాల నుంచి రావులపాలెం అరటి మార్కెట్‌యార్డుకు మోటార్‌సైకిల్‌పై లోడు తెచ్చేందుకు బయలుదేరాడు. ఆ సమయంలో లక్ష్మీపోలవరం వద్దకు వచ్చే సరికి వేగంగా పొడగట్లపల్లి వైపు వెళుతున్న ట్రాక్టర్ బలంగా ఢీకొంది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు మృతిని కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారితో చర్చలు జరిపి అనంతరం మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరించిన్నట్లు పోలీసులు తెలిపారు.

మాకు దిక్కెవరూ....

పనికోసం వెళ్లిన తన భర్త ప్రమాదంలో మృతి చెందాడన్న వార్త విన్న మృతుడి భార్య, కుమార్తె మాకు దిక్కెవరంటూ రోదిస్తున్న తీరు అందర్నీ కలిచివేసింది. మృతిచెందిన వీధి శ్రీనివాసరావుకు భార్య ధనలక్ష్మి, కుమార్తు వీరబాబు, కుమార్తె ఉండగా కుమార్తు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. కుమార్తె రాజానగరం కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతుంది. అప్పుడు కుమార్తు, ఇప్పుడు భర్త మృతి చెందడంతో ఆ తల్లీకూతురు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


తోటపల్లిలోని గ్యాస్ ఏజెన్సీ పాయింట్

ఉచిత గ్యాస్ పథకానికి

విభజన చిక్కుముడి

- ఇంకా తెలంగాణ పేరిట గ్యాస్ కనెక్షన్లు
- అర్హత కోల్పోతున్న ఆరేడు వేల మంది గ్యాస్ వినియోగదారులు
- పదేళ్లు అవుతున్నా ఆంధ్రాకు బదిలీ చేయని కనెక్షన్లు

ఎటపాక, నవంబరు3(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విభజన, విలీన మండలాలు ఆంధ్రాలో విలీనం జరిగి దాదాపు పదేళ్లు దాటుతున్నా... విలీన వాసులకు ఇంకా విభజన సమస్యలు తొలగడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా మహిళల కోసం ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి విలీనవాసులు దూరమవుతున్నారు. గత ఐదారు రోజుల నుంచి ఎటపాక మండలంలో తోటపల్లి, సీతాపురం, నెల్లిపాక, రాయనపేట, నందిగామ, తదితర గ్రామాల్లోని గ్యాస్ వినియోగదారులు ముందుగా గ్యాస్ బుకింగ్ చేసుకుని, ఉచిత గ్యాస్ పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్ విలువ నగదు చెల్లించి, గ్యాస్ సిలిండర్‌ను కొనుగోలు చేసుకొంటున్నారు. గ్యాస్ నగదు 48 గంటల్లో ఖాతాల్లో జమవుతుందని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చెప్పడంతో అనేక మంది వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకుంటున్నారు. అయితే 48 గంటలు దాటినా వారి వారి బ్యాంకుఖాతాల్లో ఉచిత గ్యాస్‌కు సంబంధించిన నగదు జమకాకపోవడంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చుట్టూ తిరుగుతున్నారు. చివరకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మీ గ్యాస్ కనెక్షన్లు ఇంకా తెలంగాణ (భద్రాచలం)లో నమోదు ఉన్నాయని, అందుకే నగదు జమకావడంలేదని చెప్పడంతో గ్యాస్ వినియో గదారులు కంగుతింటున్నారు.

ఇంకా తెలంగాణ పేరిట నమోదై ఉన్న కనెక్షన్లు

రాష్ట్రం విడిపోయి దాదాపు పదేళ్లు దాటుతున్నా, విలీన మండలాల గ్రామాలకు చెందిన గ్యాస్ వినియోగదారుల గ్యాస్ కనెక్షన్ల ఇంకా తెలంగాణలోని భద్రాచలం (హెచ్‌పీ గ్యాస్) పేరిట నమోదై ఉండడం, అక్కడి గ్యాస్ సంస్థ ప్రతినిధులు నిర్లక్ష్యం స్పష్టంగా కనబడు తోంది. పదేళ్లు దాటుతున్నా భద్రాద్రి హెచ్‌పీ గ్యాస్ సంస్థ ప్రతినిధులు ఆంధ్ర గ్యాస్ వినియోగదారుల కనెక్షన్లను ఆంధ్ర పరిధిలోకి బదిలీ చేయడానికి నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇన్నాళ్లు సాంకేతిక సమస్య సాకు చూపిస్తూ బదిలీ ప్రక్రియను నిలిపివేశారనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణ పేరిట నమోదై ఉన్న గ్యాస్ వినియోగదారులు ప్రతీ గ్రామంలో 20, 30మంది వరకు ఉన్నట్లు ప్రాథ మిక అంచనాగా తెలుస్తోంది. వీరిలో కొందరు మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం గ్యాస్ ఏజెన్సీలవద్ద సిలిండర్‌ను పొందుతున్నారు. సిలి ండర్ పొంది రెండు రోజులు గడుస్తున్నా నగదు జమవకపోవడంతో వినియోగదారులు లబోదిబో మంటున్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం ఈ సమస్యపై తెలంగాణలోని భద్రాచలం లేక మారేడుమిల్లి వెళ్లాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. దాంతో గ్యాస్ వినియోగదారులు ఏం చేయాలో తెలిక అయోమయానికి గురవుతున్నారు.

అర్హత కోల్పోతున్న ఆరేడు వేల మంది వినియోగదారులు

తెలంగాణలో గ్యాస్ కనెక్షన్లు నమోదై ఉండడంతో ప్రభుత్వం అందించే ఉచిత సిలిండర్ పథకానికి మండలంలో ఆరేడు వేలమంది వినియోగదారులు అర్హత కోల్పోతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం అందించే పథకానికి వీరు అర్హులైన భద్రాచలం హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా పథకానికి దూరమవుతున్నారనే విమర్శలు వెలువడుతున్నారు. గత ఐదారు రోజుల నుంచి చాలామంది వినియోగదారులు ముందుగా నగదు చెల్లించి, గ్యాస్ సిలిండర్ పొందుతున్నారు.తర్వాత రెండు రోజులు గడుస్తున్నా అకౌంట్‌లో నగదు జమకాకపోవ డంతో గందరగోళంకు గురవుతున్నారు. గ్యాస్ ఏజెన్సీనిర్వాహకులు ఆధార్‌కార్డుల మార్పు, ఈకేవైసీ చేసుకోవాలని సూచిస్తూ ఉండడంతో వినియోగదారులు వాటిని కూడా చేయిస్తున్నారు. ఈకేవైసీ పేరుతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రూ 200 వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ఈ విషయమై భద్రాచలం హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ వెంకన్న సంప్రదించగా సాంకేతిక కారణంగా బదిలీ ప్రక్రియలో జాప్యం జరిగిందని, వినియోగదారులు గ్యాస్ బుక్, డాక్యుమెంట్, ఆధార్‌తో తమ వద్దకు వస్తే సమస్యను పరిష్కస్తామని చెప్పారు.

తలుపులమ్మ కరుణించమ్మ

- ఆలయానికి రూ.1.27లక్షల ఆదాయం


భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

తునిరూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఒక్కరోజే భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.1.27లక్షల ఆదాయం సమకూరింది.

రాష్ట్రంలో తొలి ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ



రాజమహేంద్రవరంలో ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ రాజమహేంద్రవరంలోని సాయి హాస్పిటల్‌లో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఆసుపత్రి ఎండీ డాక్టర్ కురుకూరి విజయ్‌కుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అరుదైన మోచిప్ప మార్పిడి సర్జరీ చేయడం దక్షిణ భారత దేశంలోనే ఇది మూడోవదన్నారు. బెంగుళూరులో ఒకటి, హైదారాబాద్‌లో ఒకటి మాత్రమే జరిగాయని, మూడోవది రాజమహేంద్రవరం సాయి హాస్పిటల్‌లో చేశామన్నారు. మోచిప్ప అరుగుదలకు సంబంధించి చేసే సర్జరీని ఎపిసర్ఫ్ సర్జరీ అంటారన్నా రు. తమ ఆసుపత్రికలో.. అమెరికాలో స్థిరపడిన ఎన్ఆర్ఐ పేషంట్ మోచిప్పలో ఉన్న అరుగుదలను సరిచేసేందుకు ఇంప్లాట్లను పేషంట్‌కు తగ్గట్టుగా ఇంప్లాంట్ల తయారీ సంస్థలు డిజైన్ చేసి తయారు చేశాయన్నారు. స్వీడన్‌లో వాటిని తయారు చేశాయన్నారు. దానిని తమ ఆసుపత్రిలో తనతో పాటు మంగుళూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ దీపక్ రే, యశోదా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పూర్ణచంద్రతేజస్వీ కలిసి గంట వ్యవధిలో సర్జరీ పూర్తిచేశామని విజయ్‌కుమార్ చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఉప్పలగుప్తం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చినగాడవిల్లి కాల్వగట్టుకు చెందిన ఉంద్రు సతీష్(28) విద్యుదాఘాతంతో శనివారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో సోమాలమ్మ హుండీ ప్రాంతంలో రహదారిపై వాహనంలోకి కొబ్బరికాయలు ఎగుమతి చేస్తుండగా ప్రమాదంజరిగింది. ఎస్‌ఐ చలమల రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైన్ పనులకు శంకుస్థాపన

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కామనగరువు శివారు జంగంపాలెం వద్ద డ్రైన్ నిర్మాణ పనులకు సర్పంచ్ నక్కా అరుణకుమారి ఆదివారం భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో చొల్లంగి శ్రీను, పర్తంశెట్టి ఆదినారాయణ, నక్కా చంద్రశేఖర్‌తో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి నిధుల గండం

- శిథిలావస్థలో శత వసంతాల పాఠశాల భవనం
- శిథిల భవనంలో చిన్నారుల చదువులు
- వర్షం నుంచి టార్పాలిన్‌తో పైకప్పుకు రక్షణ
- ఆందోళనలో తల్లిదండ్రులు



వర్షం నుంచి రక్షణకు టార్పాలిన్ కప్పిన దృశ్యం, పాఠశాల పైకప్పు దెబ్బతిన్న దృశ్యం

ఉప్పలగుప్తం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శత వసంతాల పాఠశాల భవనం శిథిలావస్థలో ఉంది. పెంకుటింటి పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. పైకప్పు నుంచి వర్షం నేరుగా గదుల్లోకి కురుస్తోంది. పెంకుటిల్లు పెచ్చులు ఊడి విద్యార్థుల మీద పడుతున్నాయి. వర్షాలకు కొన్ని రోజులు అక్కడక్కడా తరగతులు నిర్వహించారు. స్థానిక వ్యాపారి మానే దుర్గారావు సహకారంతో పైకప్పుకు టార్పాలిన్ కప్పి వర్షం నుంచి రక్షణ కల్పించారు. ప్రస్తుతం శిథిల కట్టడంలోనే చిన్నారుల చదువులు కొనసాగుతున్నాయి. గొల్లవిల్లి మెయిన్ మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఇది. గత ఏడాది ఈ పాఠశాల భవనం నూరేళ్ల పండుగు జరుపుకుంది. ఈ పెంకుటిల్లు ఎప్పుడు నేల కూలుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. నూతన భవన నిర్మాణానికి నిధుల కోసం వేట సాగిస్తున్నారు. గతంలో ఒకసారి నిధులు మంజూరుకాగా అప్పట్లో వినియోగించుకోలేదు. ఫలితంగా ఇప్పుడు నిధుల మంజూరుకు నిబంధనలు అడ్డంకిగా మారాయి. మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కోరుతూ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు సంబంధిత వివరాలను అందించారు. నిధులు మంజూరుకు ఎమ్మెల్యే విద్యాశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించారు. నూతన పాఠశాల భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బాలయోగీశ్వరుల జన్మదిన వేడుకలు



ముమ్మిడివరంలో బాలయోగీశ్వరులను ఊరేగిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీ భగవాన్ పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల జన్మదిన వేడుకలను ఆదివారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి జన్మస్థలంలో ఉదయం ప్రత్యేక పూజలు జరిపించారు. సుప్రభాత సేవ, గోపూజ, విశేష పూజలు, భారీ అన్నసమారాధన నిర్వహించారు. తపో ఆశ్రమంలో కూడా ప్రత్యేక పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం భగవాన్ పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి మేళతాళాలు, బాజభజంత్రీలు, బాణసంచా కాల్పులతో ముమ్మిడివరం నగర పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఏపీ స్టేట్ సెన్సెస్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి పొలమూరి బాలకిరణ్, తపో ఆశ్రమ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.రామారావు, చిక్కం శ్రీనివాసరావు, భూపతి వెంకటరమణ, స్వామివారి కుటుంబ సభ్యులు కాశి బాలమునికుమారి, కటికదల చంద్రరావు, టీడీపీ నాయకులు చెల్లి అశోక్ పాల్గొన్నారు. భక్తులకు తపో ఆశ్రమ కమిటీ, బాలయోగీశ్వరుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించారు.

రాత్రి వేళల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


ఆదుర్రులో రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టరు

మామిడికుదురు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నదీ తీర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా రాత్రి సమయాల్లో యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పనపల్లి, బి.దొడ్డవరం, ఆదుర్రు, బాడిలంక తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా సాగుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో అధికారికంగా ఇసుక రీచ్‌లు లేనప్పటికీ రాత్రి సమయంలో పడవలపై ఇసుకను నదీ పరివాహక ప్రాంతాలకు తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రకటించినప్పటికీ అది ఎక్కడా అమలు కావడంలేదని, అక్రమార్కులు సొమ్ము చేసుకోవడానికి ఇసుక ఆదాయ వనరుగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గతంలో ఉన్న రీచ్‌లను అధికారికంగా ప్రకటించి ప్రజలకు అవసరమైన ఇసుకను సరఫరా చేసేవిధంగా అధికారులు చూడాలని, అనధికార ఇసుక తవ్వకాలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆర్యవైశ్యుల భగినీ హస్త భోజనాల సందడి

అల్లవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలకు ప్రతీకగా ఆర్యవైశ్యులు యమద్వితీయ రోజున ఆత్మీయ పండుగ చేసుకున్నారు. కొమరగిరిపట్నం, బెండమూర్లంక, అల్లవరం తదితర గ్రామాల్లో ఆర్యవైశ్య కుటుంబాల్లో యమద్వితీయ రోజు సందర్భంగా భగినీహస్త భోజనాలతో సందడి చేశారు. కార్తీకమాసంలో భగినీహస్త భోజనాలు సంప్రదాయబద్ధంగా వస్తున్నాయని మన్యం సూరిబాబు చెప్పారు.

చెన్నమల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

మామిడికుదురు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలో వేంచేసి ఉన్న ఉమాచెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తపల్లి మహేష్‌శర్మ ఆధ్వర్యంలో చెన్నమల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, ఉమాదేవికి లక్ష కుంకుమార్చన పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలో పలు పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లంకతల్లెమ్మకు, లక్ష్మీదుర్గమ్మకు సారె, చీర సమర్పణ


గేదెల్లంకలో గ్రామదేవత లంకతల్లెమ్మ, లక్ష్మీదుర్గ అమ్మవారికి సారె, చీర తీసుకెళ్తున్న గ్రామస్తులు

ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని ప్రజలు సుఖ సంతోషాలతో వెలిగొందాలని, అంతా ఆనందోత్సాహాలు అష్టైశ్వర్యాలతో తులతూగాలని సమరసత సేవా ఫౌండేషన్, గ్రామస్తుల ఆర్థికసాయంతో ఆదివారం గ్రామదేవతలకు సారె, చీర సమర్పించారు. గ్రామంలోని లంకతల్లెమ్మకు, లక్ష్మీదుర్గమ్మకు తెల్లవారుజాము నుంచి విశేష అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించి పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు, పండ్లు, చలిమిడి, స్వీట్లు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమలాపురం గాయత్రీ పీఠం ఆధ్వర్యంలో దీపయజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గొలకోటి వెంకటరెడ్డి, గుద్దటి జమి, గుద్దటి వీరాస్వామినాయుడు, బొంతు కనకారావు, గుద్దటి శివరామకృష్ణ, గుద్దటి వెంకటేశ్వరరావు, గుద్దటి భీమన్న, గుద్దటి పట్టాభిరామయ్య, గుద్దటి లక్ష్మీనారాయణమ్మ, తాయారు, సుంకర వేణు, సాధనాల జానకీదేవి, గుద్దటి రమణమ్మ, నల్లా ఆండాళ్‌దేవి, గుత్తుల లక్ష్మీదుర్గలతో పాటు పలువురు పాల్గొన్నారు. రావిచెట్టు సెంటర్‌లో బాలభక్త ఆలయ కమిటీవారు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

అదనపు కట్నం వేధింపులపై మహిళ ఫిర్యాదు

ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకుని రమ్మని భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారని ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకకు చెందిన ఓ మహిళ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. లంకాఫ్‌ఠాణేలంకకు చెందిన కర్రి స్వామి కుమార్తె ముత్యాలును 2011ఫిబ్రవరి 5న కరీంనగర్ జిల్లా రామ్‌నగర్‌కు చెందిన శీలం సందీప్‌తో వివాహం జరిపించారు. వారికి ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. భర్త వ్యసనాలకు బానిసై పుట్టింటి నుంచి అదనంగా కట్నం తెమ్మని వేధింపులకు గురి చేస్తున్నాడని ఆమె కరీంనగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భర్త, అత్తమామల్లో ఎటువంటి మార్పు రాకపోవడంతో పుట్టింటికి వచ్చేశానని, వ్యవసాయ పనులు చేసుకుని పిల్లల్ని పోషిస్తున్నానని, ఇటీవల తన భర్త ఇంటికి వచ్చి కొద్దిరోజులు కాపురం చేశాడని, మళ్లీ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసి కరీంనగర్ వెళ్లిపోయాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

వసతి గృహాలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు


బాలికల వసతిగృహంలో వసతుల గురించి ఆరా తీస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని బాలుర, బాలికల వసతిగృహాలు అధ్వానంగా తయారయ్యాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆరోపించారు. ఆదివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి వసతిగృహాలను పరిశీలించారు. బాలికల వసతిగృహం శిథిలస్థితికి చేరిందని, చుట్టూ మురుగునీరు చేరి దుర్భరంగా ఉందన్నారు. రెండు వసతిగృహాల్లోను విద్యార్థులకు అవసరమైన మెనూ సక్రమంగా పంపిణీ కావడం లేదని తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనంచేసి అసంతృప్తి వెలిబుచ్చారు. వసతిగృహంలోని పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. కార్యక్రమంలో అప్పన శ్రీరామకృష్ణ, మాచవరపు శివన్నారాయణ, వంటెద్దు బాబి, అయితాబత్తుల సుభాషిణి, మొల్లేటి వెంకటేశ్వరరావు, బొంతు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా బొమ్మిడి ధర్మారావు



కాట్రేనికోన, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు టి.ధర్మారావు, నిమ్మకాయల లక్ష్మణరావు, కంబాల బాబూరావు, ఎండీ రఫీ, దొమ్మేటి వెంకటేశ్వరరావు, యెరుబండి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం మండల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మీరా మహమ్మద్, అధ్యక్షునిగా బొమ్మిడి ధర్మారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే మక్బూల్, కోశాధికారిగా ఆర్.సురేష్‌బాబు ఎన్నికయ్యారు.

కార్పెంటర్ల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలి


మంత్రి సుభాష్‌కు కార్పెంటర్ల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్పెంటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కోరుతూ దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మికులతో పాటు కార్పెంటర్లు, చేతివృత్తిదారులు వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని ఉపాధిని సైతం కోల్పోయారని వివరించారు. టింబర్ డిపోల్లో రెడీమేడ్ వేప కర్రతో గుమ్మాలు, కిటికీలుతయారుచేసి విక్రయించడం వల్ల వడ్రంగి కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారని వెంటనే వాటిని అరికట్టాలని కోరారు. యాభై ఏళ్లు నిండిన చేతివృత్తిదారులకు, కార్పెంటర్లకు పెన్షన్ మంజూరు చేయాలని, వడ్రంగి పనివారలకురాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి విశ్వకర్మయోజన పథకంలో భాగంగా కార్మికులకు జిల్లాలో శిక్షణా తరగతులు నిర్వహించి నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు గురైన వారికి కార్పొరేట్ వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు అప్పారి శ్రీనివాస్, సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, ఉపాధ్యక్షుడు కొనుకు వెంకటేశ్వరరావు, కన్వీనర్ కుసుమే నరసింహారావు, ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి పితాని బేబీరావు, గానాల సాయి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబానికి తెలుగుదేశం మండల యువత అధ్యక్షుడు రవివర్మ ఆర్థికసాయంగా కిరాణా వస్తువులు, కూరగాయలను అందించారు. కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని తోట్లపాలేనికి చెందిన ఉంద్రాజవరపు వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని రవివర్మ ఆదివారం పరామర్శించి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రేకాడి రాంబాబు, అయినవిల్లి వలీబాబా, పెన్నాడ నాగబాబు, పెన్నాడ శివ, అయినవిల్లి నాగు, కుంచే ప్రసాద్, కుంచే శ్రీనివాసరావు, పోతుమూడి రమేష్, కొమానపల్లి శ్రీను ఉన్నారు.

ఫిబ్రవరి 2న దేవాంగ సంఘ స్వర్ణోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఊటుకూరి

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవాంగ సంక్షేమ సంఘ స్వర్ణోత్సవాలను 2025 ఫిబ్రవరి 2న బండారులంకలో ఘనంగా నిర్వహించేందుకు శ్రీకోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కోనసీమ శాఖ అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అధ్యక్షతన బండారులంకలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. స్వర్ణోత్సవాలను విజయవంతం చేసేందుకు ఊటుకూరి వీరబ్రహ్మాణ్యం చారిటబుల్‌ట్రస్టు రూ.55 వేలు, చింతా అత్తిలింగం, శంకరమూర్తి సోదరులు రూ.50వేలు, జాన శంకరరావు (బాబ్జి) రూ.50వేలుతో పాటు పలువురు విరాళాలను ప్రకటించారు. 5వేలమంది సంఘీయులతో నిర్వహించ తలపెట్టిన స్వర్ణోత్సవ వేడుకలను అన్ని గ్రామాల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు విజయవంతం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. సంక్షేమ సంఘ ప్రతినిధులు పుత్సల వరదరాజు, పిచ్చిక శ్యామ్, చింతా శంకరమూర్తి, పిచ్చిక పోలిశెట్టి, అంకం నాగమల్లేశ్వరరావు, చింతా వీరభద్రేశ్వరరావు, దైవపు నందయ్య, మాడా రాము, బళ్ల వెంకటేశ్వరరావు, గుమ్మిడి రాజు పాల్గొన్నారు.

సమస్యలపై 112కు సమాచారమందించండి

అమలాపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలకు రక్షణగా ఉండేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఎటువంటి ప్రమాదం సంభవించినా, ఇబ్బందులు ఎదురైనా బాలికలు తక్షణం 112కు సమాచారం అందించాలని సూచించారు. స్థానిక వడ్డిగూడెం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

సాగర తీరంలో కార్తీక సందడి

- ప్రమాదభరితమైన ప్రదేశాల్లో సముద్ర స్నానాలు


ఓడలరేవు సముద్రతీరంలో సందడి

అల్లవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ఓడలరేవు సాగర తీరంలో, బోడసకుర్రు వైనతేయ నదీ వద్ద కార్తీక సందడి ప్రారంభమైంది. కార్తీక మాసం ప్రారంభం, ఆదివారం సెలవు రోజు కావడంతో అమలాపురం, అల్లవరం మండలాల నుంచి యువతీ, యువకులు కుటుంబ సమేతంగా ఓడలరేవు పిక్నిక్ స్పాట్‌లో వనభోజనాలు చేసి గంటల తరబడి సందడి చేశారు. ఓడలరేవు తీరంలో అలలకు కోతకు గురైన ప్రాంతంలో ప్రమాదభరితంగా ఉన్నప్పటికి కొంత మంది యువకులు స్నానాలు ఆచరించారు. బోడసకుర్రు- పాశర్లపూడి వైనతేయ బ్రిడ్జి సమీపంలో రైల్వే లైన్ పిల్లర్ల వద్ద ఇసుక మేటపై యువతీయువకులు సందడి చేశారు. కొందరు యువకులు ఇసుక తిన్నెల వద్ద లోతైన నదిలో దిగి స్నానాలు చేశారు. గతంలో సముద్రతీరంలో కొందరి యువకులు ప్రాణాలు పోగొట్టుకున్న సంగతి విదితమే. సాగరతీరంలో ప్రమాదాలు జరగకుండా మెరైన్ పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఐ.పోలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో 39మంది లబ్ధిదారులకు రూ.30,64,343 విలువైన చెక్కులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్, బొంతు శ్రీరాములు, మందాల గంగసూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమైక్యంగా ముందుకు వెళ్లాలి


మలికిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమైక్యంతో అన్ని వర్గాలను కలుపుకుంటూ ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం విశ్వేశ్వరాయపురంలో విశ్వబ్రాహ్మణ పంచవృత్తుల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు. సంఘ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

అమలాపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై జరిగిన దాడులతో పాటు ఇటీవల మండపేటలో జరిగిన దాడిని ఖండిస్తూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు అధ్యక్షతన ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, న్యాయవాది వై.సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, పౌరహక్కుల సంఘం నాయకుడు అమలదాసు బాబూరావు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, జిత్తుక సత్యనారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, మాలమహానాడు నాయకులు గెల్లా రాజేంద్ర, గిడ్ల శ్యామ్ తదితరులు మాట్లాడారు. దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సింది పోయి పాలకులే నిందితులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. అన్ని స్థాయిల్లోను తక్షణం విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మండపేటలో జరిగిన దాడి కేసులో బాధ్యులైన ఆధిపత్య కులస్తుల అందరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కుల వివక్షతో కూడిన దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీలు సమావేశాలు నిర్వహించి బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు మామిడికుదురు విద్యార్థి



మామిడికుదురు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు మామిడికుదురుకు చెందిన మట్టా సత్యరామ్‌పాల్ ఎంపికయ్యాడు. రామ్‌పాల్ ప్రస్తుతం నగరంలోని శ్రీచైతన్య స్కూలులో 8వ తరగతి చదువుతూ శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైనట్టు కోచ్ మట్టా సత్తిబాబు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఈనెల25 నుంచి అమలాపురంలో జరుగుతాయని, రాష్ట్రంలోనే 12 జిల్లాలు పాల్గొంటాయని, అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి రామ్‌పాల్ కూడా పాల్గొంటాడని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

శెట్టిబలిజ, గౌడ నాయకులు ఐక్యత చాటాలి


మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

రాజోలు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ, గౌడ నాయకులు వర్గాలకు, రాజకీయాలకు అతీతంగా ఐక్యత చాటాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. తాటిపాక శెట్టిబలిజ సంక్షేమ సంఘం భవనం వద్ద శ్రీవెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన రాజోలు తాలూకా శెట్టిబలిజ, గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్తీక వనసమారాధన మహోత్సవ కార్యక్రమంలో మంత్రి సుభాష్ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. మద్యం దుకాణాల్లో పది శాతం దుకాణాలు కల్పించడం అభినందనీయమన్నారు. మరో ముఖ్య అతిథి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రసంగించారు. జడ్పీ మాజీ చైర్మన్ శేషుబాబు, మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, గొల్లపల్లి సూర్యారావు, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ప్రసంగించారు. కార్తీకమాస వనసమారాధన మహోత్సవం వైభవంగా జరిగింది. కాంట్రేగుల సత్యనారాయణ, గుబ్బల మనోహర్, గుబ్బల శ్రీనివాస్, కోళ్ల జయేంద్రకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్, యనమదల సీతారామరాజు, మొల్లేటి శ్రీనివాస్, కాకి లక్ష్మణ్, గుబ్బల శ్రీనివాస్, గుబ్బల బాబ్జి, అనుమారి పురుషోత్తం పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓట్లు నమోదు చేయించుకోండి

మలికిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదులో అందరూ వేగవంతంగా పాల్గొనాలని మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన పట్టభద్రుల ఓటు అవగాహన కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. డిగ్రీ పట్టభద్రులైన అందరూ ఓటును నమోదు చేయించుకోవాలని కోరారు. సమావేశంలో నల్లి శివ, తోటే ప్రతాప్, చింతా రాజబాబు, గెడ్డం ఫిలిప్‌రాజు పాల్గొన్నారు.

అమరజ్యోతి అంబేడ్కర్ గ్రంథం ఆవిష్కరణ


అమరజ్యోతి అంబేడ్కర్ గ్రంథాన్ని ఆవిష్కరణ చేస్తున్న అతిథులు

యానాం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యానానికి చెందిన జనమిత్ర సంపాదకులు, రచయిత కళైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి రచించిన అమరజ్యోతి డాక్టర్ అంబేడ్కర్ అనే పరిశోధనాత్మక గ్రంథ ఆవిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఆదివారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన సభకు కవి, కథకుడు దాట్ల దేవదానం రాజు అధ్యక్షత వహించారు. వైఎస్ఆర్ మెడిక్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉపాసక డాక్టర్ కోరుకొండ బాబ్జీ విశిష్ట అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని పరిపాలనాధికారి మునిస్వామికి అందజేశారు. ఈసందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ విష్ణుమూర్తి అమూల్యమైన గ్రంథాన్ని రాశారన్నారు. అనంతరం పరిపాలనాధికారి మునిస్వామి మాట్లాడుతూ పుస్తకాలను చదవాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా బౌద్ధ పరిశోధకులు పల్లి రాంబాబు, దాట్ల దేవదానంరాజు, నామాడి అప్పారావు, కోరుకొండ భానుమతి, మోకా పావన్‌కుమార్, ముంగండ ఆశీర్వాదం, గిడ్డి బలరాం మాట్లాడారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోయి విజయభారతి ఇటీవల మృతి చెందగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. సభలో కవి, కథకుడు పెనుమాక రత్నాకర్‌ను విష్ణుమూర్తి ఘనంగా సత్కరించారు. అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు, యువకులు, నాయకులు, గ్రామపెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధనగిరి పూజ

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జనుపల్లి ఇస్కాన్ ఆధ్వర్యంలో రావులచెరువు రామాలయం వద్ద ఆదివారం గోవర్ధనగిరి పూజా మహోత్సవం నిర్వహించారు. రాజమహేంద్రవరం ఇస్కాన్ టీఎంసీ చైర్మన్ శివానందనిమాయీదాసు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బృందావన వాసులను రక్షించేందుకు ఏడు రోజుల పాటు చిటికెనవేలిపై కృష్ణ పరమాత్ముడు గోవర్ధనగిరి పర్వతాన్ని ఎత్తి పట్టుకున్నారని వివరించారు. భక్తులు గోపూజల్లో పాల్గొన్నారు. అఖండ హరినామ సంకీర్తన, కృష్ణలీలలపై ప్రవచనాలు నిర్వహించారు. సర్పంచ్ గానాల భారతి-వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు గొవ్వాల అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


ఇస్కాన్ మందిర చైర్మన్ శివానంద నిమాయిదాస్ ప్రవచనాలు

అంబాజీపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణుడు చిటికిన వేలు మీద గోవర్ధన గిరి ఎత్తి పట్టుకుని ఊరివారికి రక్షణ కల్పించాడని రాజమహేంద్రం ఇస్కాన్ మందిర చైర్మన్ శివానంద నిమాయిదాస్ అన్నారు. మాచవరం దొమ్మేటివారిపాలెంలో ఉన్న శ్రీకృష్ణమందిరంలో శ్రీకృష్ణుడి గోవర్ధన గిరి పూజలను నిర్వహించారు. ఈసందర్భంగా ఇస్కాన్ మందిర చైర్మన్ శ్రీకృష్ణుడిగోవర్ధన గిరి ప్రవచనాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు ఏడు రోజులు గోవర్ధన గిరిపట్టుకునే ఉన్నాడని, దీనికి గుర్తుగా వైష్ణవ సంప్రదాయాలు ఇప్పటికి దీపావళి మరుసటి రోజున గోవర్ధన పూజ నిర్వహిస్తారన్నారు. గోపజనులను, గోవులను కాపాడిన కృష్ణుడు ఆ రోజు నుంచి గోవిందుడయ్యాడని, గిరిని ఎత్తి గిరిధారి అయ్యాడని పేర్కొన్నారు. అనంతరం హరిరామ సంకీర్తన, హారతి, గోవర్ధన గిరి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు శ్రీకృష్ణ శెట్టిబలిజ సంఘ సభ్యులు, ఇస్కాన్ సభ్యులు దాస్, నందనదాస్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ పూజలు

అంతర్వేది, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి కృష్ణా జిల్లా కలెక్టర్ టీకే బాలాజీ(ఐఏఎస్) ఆదివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఏసీ వారికి అందించారు.

చిన్నపిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టి సారించి వారిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ అధ్యక్షతన ఆదివారం బండారులంక బీవీఎన్ మల్లేశ్వరరావు కాంప్లెక్సులో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మూర్తి చిన్నపిల్లల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఉప్పలగుప్తం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చిన గాడవిల్లి కాల్వగట్టుకు చెందిన ఉండ్రు సతీష్(28) విద్యుదాఘాతంతో శనివారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో సోమాలమ్మ హుండీ ప్రాంతంలో రహదారిపై వాహనంలోకి కొబ్బరికాయలు ఎగుమతి చేస్తుండగా ప్రమాదంజరిగింది. ఎస్ఐ చలమల రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైన్ పనులకు శంకుస్థాపన

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కామనగరువు శివారు జంగంపాలెం వద్ద డ్రైన్ నిర్మాణ పనులకు సర్పంచ్ నక్కా అరుణకుమారి ఆదివారం భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో చొల్లంగి శ్రీను, పర్తంశెట్టి ఆదినారాయణ, నక్కా చంద్రశేఖర్‌తో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

● సీఎం ఆదేశాలు బేఖాతరు
● స్థానిక అధికారులు కాసులకు కక్కుర్తి పడి తవ్వకాలకు రైట్
● అనధికారికంగా ర్యాంపు బాటలు వేసుకుని యథేచ్ఛగా తరలింపు





పులిదిండి ఇసుక రీచ్‌లో తవ్వకాలు నిర్వహించిన దృశ్యం, కట్టుంగలో నిల్వచేసిన ఇసుకను తరలిస్తున్న దృశ్యం



పులిదిండిలో ఇసుకను నిల్వ చేసిన అక్రమార్కులు

ఆత్రేయపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఉచితంగా అందించే ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని సీఎం చంద్రబాబునాయుడు అక్రమార్కులకు హెచ్చరికలు జారీచేసినా జిల్లా అధికార యంత్రాగం ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోలేకపోతున్నారు. సీఎం ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమార్కులు చేలరేగిపోతున్నారు. స్థానిక అధికారులు కాసులకు కక్కుర్తి పడి తవ్వకాలకు రైట్ చెప్పడంతో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగిపోతుంది. ఆత్రేయపురం మండలంలోని పేరవరం, రాజవరం, పులిదిండి, కట్టుంగ నదీపరివాహక ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లను అక్రమార్కులు అనధికారికంగా ర్యాంపు బాటలు వేసుకుని యథేచ్ఛగా ఇసుకను తరలించుకుపోతున్నారు. బొబ్బర్లంక వశిష్టగోదావరి బ్యారేజీకి సమీపంలో అక్రమార్కులు, ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు. తరలిస్తున్న ఇసుకను ధవళేశ్వరం, విజ్జేశ్వరం బ్యారేజీ మీదుగా రాత్రివేళల్లో జిల్లా సరిహద్దులను దాటిస్తూ లక్షలాది రూపాయాలు ఆర్జిస్తున్నారు. 5యూనిట్ల ఇసుక ధర రూ.20వేలు పైమాటే. రాత్రి వేళల్లో ఇసుక లారీలను పట్టుకుంటున్న అధికారులు కాసులకు కక్కుర్తిపడి వదిలిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక రీచ్‌ల్లో అనాధికారకంగా తవ్వకాలు నిర్వహిస్తు రహస్య ప్రదేశాలలో నిల్వ చేస్తున్నారు. అలా నిల్వ చేసిన ఇసుకను పట్టపగలే దర్జాగా ఇసుకను తరలిస్తూ కాసులు అర్జిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ యంత్రాగం ఇసుక అక్రమతవ్వకాలను నిరోధించలేకపోతున్నారనే ఆరోపణలు వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుకాసురలతో స్థానిక అధికారులు కుమ్మక్కు అవ్వడంతో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. కాటన్ బ్యారేజీ, లొల్ల లాకులపై భారీ వాహనాలు నిషేధం అమలులో ఉన్నప్పటికీ రాత్రి వేళల్లో ఇసుక లారీలు పరుగులు పెట్టడంతో కాటన్ కట్టడాలకు పెనుప్రమాదం పొంచి ఉంది. వశిష్ట, గౌతమి పరివాహక ప్రాంతాల్లోని ఇసుక ర్యాంపుల్లో అక్రమార్కులు ఇసుకను కొల్లకొట్టుకుపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధించి చంద్రబాబు ఆదేశాలను జిల్లా అధికారులు పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంది. లేకపోతే కూటమి ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉంది. ఆదివారం తెల్లవారుజామున పేరవరం నదీగర్భంలో అక్రమార్కులు ఇసుకను భారీ లారీ ద్వారా తరలిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ రాము సంఘన స్థలానికి చేరుకుని అక్ర మంగా తరలిస్తున్న ఇసుక లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇసుకాసురులపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

పలివెల పశువుల ఆసుపత్రి దుస్థితిపై రైతుల గగ్గోలు

● కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురై దోమలు, బురదతో అధ్వానస్థితికి
● తుప్పలు, చెత్తా చెదారం నిండిపోయిన వైనం ● ఆసుపత్రి పరిసరాల అపారిశుధ్యంతో దుర్వాసన



పలివెల పశువైద్యశాల ఆవరణలో నీరు

కొత్తపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పలివెల పశువుల ఆసుపత్రి దుస్థితిపై పాడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే ఆసుపత్రి మొత్తం ముంపునకు గురై దోమలు బురదతో చాలా అధ్వానస్థితికి చేరిందని, తమ పశువులకు వైద్యం చేయించుకునేందుకు తీసుకువెళుతుంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. పశువులకు వైద్యం చేసేందుకు వీలు లేకుండా పరిసరాలు అపారిశుధ్యంతో దుర్వాసన వెదజల్లుతున్నాయని, తమ పశువులకు ఉన్న రోగాలు ఎలా ఉన్నా లేని రోగాలు వస్తాయని ఆందోళన చెందుతున్నామన్నారు. ఎక్కడికక్కడ తుప్పలు, చెత్తాచెదారం నిండిపోయినా దీన్ని పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. దీనిపై అక్కడ పనిచేస్తున్న జేవీవో రుక్మందరావును వివరణ కోరగా ఐదేళ్ల నుంచి ఆసుపత్రి లోతట్టుగా ఉండడంతో ముంపునీరు వెళ్లే మార్గం లేక బురదమయంగానే ఉంటుందని, తమ శాఖ ఉన్నతాధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వంలోనైనా మా ఆసుపత్రిని ల్యాండ్ ఫిల్లింగ్‌చేసి ఆధునికీకరిస్తారని భావిస్తున్నానన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సోమేశ్వరం విద్యార్థులు



త్రోబాల్, బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాయవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అనపర్తి బాలుర హైస్కూల్ జరిగిన అండర్-14, అండర్-17 త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో సోమేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం దయామణి శనివారం తెలిపారు. టెన్త్ విద్యార్థి యాళ్ల మణికంఠ, తొమ్మిదో తరగతి విద్యార్థి జోడా వెంకట మణికంఠ, ఎనిమిదో తరగతి చదువుతున్న గంధం కుశ్వంత్ సాయి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులతో పాటు విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన పీడీ జగదీశ్వ హెచ్‌ఎం, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

4న దివ్యాంగుల పరికరాల పంపిణీ కోసం శిబిరం

కపిలేశ్వరపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల స్థాయిలో దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన చలన పరికరాల సరఫరా కోసం అలిమ్ కో సంస్థ ద్వారా ఈనెల 4న గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. రామచంద్రపురం పట్టణం, ఎస్‌వీఆర్ పంక్షన్‌హాల్ (ఆర్టీసీ కాంప్లెక్స్)లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. మండలంలోని అందరూ దివ్యాంగులు, వయోవృద్ధులు ఈశిబిరాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఐ.పోలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో 39మంది లబ్దిదారులకు రూ.30,64,343 విలువైన చెక్కులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్, బొంతు శ్రీరాములు, మందాల గంగసూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

మామిడికుదురు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలో వేంచేసి ఉన్న ఉమాచెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తపల్లి మహేష్‌శర్మ ఆధ్వర్యంలో చెన్నమల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, ఉమాదేవికి లక్ష కుంకుమార్చన పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. ఈసందర్భంగా దేవస్థానంలో పలు పూజా కార్యక్రమాలు జరిగాయి.

ధర్మాకోల్‌తో అయ్యప్ప ఆలయ నమూనా

ఆత్రేయపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన అయ్యప్పభక్తుడు పడాల రాము ధర్మాకోల్‌తో అయ్యప్పస్వామి ఆలయ నమూనాను రూపొందించాడు. కేరళలోని శబరిమలై ఆలయ నమూనాను ధర్మాకోల్‌తో తయారు చేసి ప్రతిభను చూపడంతో పాటు అయ్యప్పస్వామిపై ఉన్న భక్తిని చాటుకున్నాడు.



ర్యాలిలో ధర్మాకోల్‌తో తయారు చేసిన అయ్యప్ప ఆలయ నమూనా

వేంకన్నకు వెండి మకర తోరణం బహూకరణ



అమ్మవార్లకు వెండి మకరతోరణాలు అందజేస్తున్న దాతలు

మండపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండపేటలో వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న అలివేలు మంగ తాయారు, గోదాదేవి అమ్మవార్లకు మండపేటకు చెందిన బులియన్ వ్యాపారి సంకా శ్రీనివాసరంగా, మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు దంపతులు ఆదివారం వెండి మకర తోరణాలను బహూకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి సత్తిబాబు, పాలకవర్గ సభ్యులు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



చెస్ చాంపియన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రావులపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అంతర కళాశాలల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో రావులపాలెం డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. అక్టోబరు 26, 27 తేదీల్లో భీమవరంలోని బీవీ రాజ్ కళాశాలలో జరిగిన చెస్ చాంపియన్‌షిప్ పోటీలలో కళాశాలకు చెందిన విద్యార్థులు రసూల్, నిర్మల్, గోపి, చందు పాల్గొని 3వ స్థానం సాధించారన్నారు. దీంతో వారిని ప్రిన్సిపాల్‌తో పాటు స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ చినబాబు, అధ్యాపకులు సర్వారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అరుణకుమార్, పీడీ యువరాజు అభినందించారు.

చిన్నపిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టి సారించి వారిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ అధ్యక్షతన ఆదివారం బండారులంక బీవీఎస్ మల్లేశ్వరరావు కాంప్లెక్సులో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మూర్తి చిన్నపిల్లల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధుల గురించి తెలియచేశారు. డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ పీఎస్ శర్మ మాట్లాడారు. క్లబ్ ప్రతినిధులు తేతల సత్యనారాయణరెడ్డి, పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి వలవల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై మహిళ ఫిర్యాదు

ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకుని రమ్మని భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారని ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకకు చెందిన ఓ మహిళ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. లంకాఫ్‌ఠాణేలంకకు చెందిన కర్రి స్వామి కుమార్తె ముత్యాలును 2011ఫిబ్రవరి 5న కరీంనగర్ జిల్లా రామ్‌నగర్‌కు చెందిన శీలం సందీప్‌తో వివాహం జరిపించారు. వారికి ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. భర్త వ్యసనాలకు బానిసై పుట్టింటి నుంచి అదనంగా కట్నం తెమ్మని వేధింపులకు గురి చేస్తున్నాడని ఆమె కరీంనగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భర్త, అత్తమామల్లో ఎటువంటి మార్పు రాకపోవడంతో పుట్టింటికి వచ్చేశానని, వ్యవసాయ పనులు చేసుకుని పిల్లల్ని పోషిస్తున్నానని, ఇటీవల తన భర్త ఇంటికి వచ్చి కొద్దిరోజులు కాపురం చేశాడని, మళ్లీ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసి కరీంనగర్ వెళ్లిపోయాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.



వన సమారాధనలో ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న దృశ్యం

కార్తీక వనసమారాధన

రాయవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరు గ్రామంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. మహిళలు, చిన్నారులకు ఆటపాటలు నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టు, శివపార్వతులు, లక్ష్మీనారాయణలకు పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

కొత్తపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కొత్తపేట తాలుకా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు మోటూరి రామారావు కోరారు. ఆదివారం ఎన్జీవో హోమ్‌లో ఆయన అధ్యక్షతన ఎన్జీవో సమావేశం జరిపారు. సమావేశంలో ఏపీ ఎన్జీవో సభ్యత్వ నమోదు, ఉద్యోగులందరికి మాసపత్రిక అందేలా సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ఎన్జీవో నాయకులు కొవ్వూరి ప్రభాకరరెడ్డి, నల్లా రామారావు, యెపుగంటి సురేష్, నాగరాజు, అరుణ సుందరి, రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వైద్యం నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి సుభాష్ ఆదివారం అందజేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రామచంద్రపురం మండలం తాళ్లపొలం గ్రామానికి చెందిన కాద ఏడుకొండలుకు రూ.40 వేలు, కె.గంగవరం మండలం తామరపల్లికి చెందిన యలమంచిలి సుప్రజకు రూ.2.2 లక్షలు, సూరంపూడి గణేష్‌కు రూ.52 వేలు చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబానికి తెలుగుదేశం మండల యువత అధ్యక్షుడు రవివర్మ ఆర్థికసాయంగా కిరాణా వస్తువులు, కూరగాయలను అందించారు. కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని తోట్లపాలేనికి చెందిన ఉండ్రాజవరపు వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని రవివర్మ ఆదివారం పరామర్శించి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు రేకాడి రాంబాబు, అయినవిల్లి వలీబాబా, పెన్నాడ నాగబాబు, పెన్నాడ శివ, అయినవిల్లి నాగు, కుంచే ప్రసాద్, కుంచే శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

వేంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామివారిని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి వేదాశీర్వచనం అందజేశారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. మూడోరోజు తిరునక్షత్ర ఉత్సవాలు ఘనంగా జరిపారు. స్వామివారి ప్రకారోత్సవం వైభవంగా నిర్వహించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,74,424 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం చక్రధరరావు తెలిపారు.

పనిచేయని ఆర్వో ప్లాంట్లు..ప్రజలకు అందని తాగునీరు





కపిలేశ్వరపురం మండలం అంగరలో పనిచేయని ఆర్వో ప్లాంటు యంత్ర పరికరాలు, అంగర పంచాయతీని ఆనుకుని నిర్మించిన ఆర్వో ప్లాంటు

కపిలేశ్వరపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయకుండా పోయాయి. 2014 అక్టోబరు 4న చంద్రబాబు సీఎంగా పగ్గాలు చేపట్టి తొలిసారిగా అంగర గ్రామం వచ్చి గ్రామాభివృద్ధికి పలు హామీలు ఇచ్చారు. అదేరోజు ఎన్టీఆర్ సుజల పథకాన్ని ప్రారంభించారు. కొంత కాలం ప్రజలకు తాగునీరు అందడంతో అభినందనలు వెల్లువెత్తాయి. అనంతరం దానిని పట్టించుకునే నాధుడు కరువవడంతో అంచెలంచెలుగా మరమ్మతులకు గురై మూలనపడింది. దీంతో ఆప్రాంత ప్రజలకు తాగునీరు అందకుండాపోయింది. గ్రామ పంచాయతీని అనుకుని బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ డాక్టర్ బలుసు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంటు నిర్మాణం కోసం దాత భవన నిర్మాణం చేపట్టారు. అందులో 2014 ఆగస్టు 8న ఓఎన్జీసీ రాజమండ్రి వారి ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటుని గ్రూపు జనరల్ మేనేజర్, అసెట్ మేనేజర్ పాసల కృష్ణారావు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు ప్రారంభించారు. దీంతో ఆప్రాంత వాసులకు తాగునీరు ఇబ్బంది లేకుండా పోయింది. అదికూడా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కాలక్రమేణ పనిచేయక ప్రజలకు నిరాశే మిగిలింది. ఈ విషయాన్ని గ్రామస్థుడు వాసా కోటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా రెండు ఆర్వో ప్లాంటులకు గాను ఒక దానిలో సబ్ మెర్సిబుల్ పంపు, మరొక దానిలో మెమోరండ్ ఫిల్టర్ మరమ్మతులకు గురైంది. నిధుల కొరత వల్ల వాటిని మరమ్మతు చేయించలేకపోయినట్టు ఇప్పుడున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మతులు చేయించనున్నట్టు తెలిపారు. వాటికి మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని అంగర, పడమరఖండ్రిక గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేసుకోండి

కె.గంగవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓట్లు నమోదుకు కూటమి కార్యకర్తలు సహకరించాలని జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు ఆయా గ్రామాల్లో పట్టభద్రులను గుర్తించి ఓట్లు నమోదు చేయించి, కూటమి అభ్యర్థికి ఓట్లు వేసేలా కృషి చేయాలని ఆయన కోరారు.

విద్యార్థుల పుస్తక పఠనం

ఆత్రేయపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం వివిధ పాఠశాలల విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. నీతికథలు, వేమన పద్యాలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై గ్రంథాలయాధికారి ఓమ్ నమఃశివాయ అవగాహన కల్పించారు.

దంగేరులో టీడీపీ సభ్యత్వ నమోదు

కె.గంగవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండలంలోని దంగేరు గ్రామంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్ చౌదరి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు సభ్యత్వాలు తీసుకున్నారు. ఐటీడీపీ ప్రతినిధులు ఆన్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేసి రశీదులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దంగేటి నాగేశ్వర రావు, మేడిశెట్టి సూర్యనారాయణమూర్తి, వాసంశెట్టి దుర్గారావు, చీకట్ల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



దంగేరులో టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

వక్ఫ్ పరిరక్షణ సభకు తరలిన ముస్లింలు

రావులపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ పరిరక్షణ మహాసభకు రావులపాలెం నుంచి ముస్లింలు విజయవాడకు తరలివెళ్లారు. జమాత్ సభ్యులు మహబూబ్ సుభాని, దువాతో మజీద్ అధ్యక్షులు బాషా, జహంఘీర్, సుభాని, మైనార్టీ సెల్ అధ్యక్షులు రహ్మద్‌తుల్లా, షరీఫ్, చినమజీద్ అధ్యక్షులు వలీ, ఐఎంఎం అధ్యక్షులు ఇమామ్ వలీ, అజీమ్ ఉన్నారు.



రావులపాలెం నుంచి వెళుతున్న ముస్లింలు

గోవర్ధనగిరి పూజ

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జనుపల్లి ఇస్కాన్ ఆధ్వర్యంలో రావుల చెరువు రామాలయం వద్ద ఆదివారం గోవర్ధన గిరి పూజా మహోత్సవం నిర్వహించారు. రాజమహేంద్రవరం ఇస్కాన్ టీఎంసీ చైర్మన్ శివా నందనిమాయీదాసు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బృందావన వాసులను రక్షించేందుకు ఏడు రోజుల పాటు చిటికెనవేలిపై కృష్ణ పరమాత్ముడు గోవర్ధనగిరి పర్వతాన్ని ఎత్తి పట్టుకున్నారని వివరించారు. భక్తులు గోపూజల్లో పాల్గొన్నారు. అఖండ హరినామ సంకీర్తన, కృష్ణలీలలపై ప్రవచనాలు నిర్వహించారు.

తపాలా ఉద్యోగినికి సన్మానం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తపాలాశాఖలో 33 ఏళ్ల సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన కె.జానకిదేవిని ఆదివారం తపాల ఉద్యోగులు సత్కరించారు. ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టుమాస్టర్ ఎన్.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రాజమహేంద్రవరం డివిజనల్ అసిస్టెంటు సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాస్, మండపేట పోస్టుమాస్టర్ ఎంవీ సుబ్బారెడ్డి, కొత్తపేట పోస్టు మాస్టర్ కె.విటల్‌నాథ్ తదితరులు మాట్లాడారు. అనంతరం కె.జానకీదేవి దంపతులను సత్కరించారు. ఎస్‌బీసీవో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.భవానీవీరకుమార్, కొండపల్లి సూర్యనారాయణ, తపాలా ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి బి.కొండబాబు, జీవీ రమణమూర్తి, కె.ఈశ్వరరావు, టి.పుల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగిని సత్కరిస్తున్న తపాలా ఉద్యోగులు